# ప్రజా తపన

prajathapana.com

News that matters




సుఖమయం, శుభదాయకం, అయిన లోకం సామాజిక ప్రగతి, వేడి మంచు, నల్లని వెలుగుల్లా అసంబద్ధమైనవే. అనర్థాలను సృష్టించని భౌతిక అభివృద్ధి ఉండదు.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 32 మంగళవారం 14 మార్చి 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


## చరిత్ర సృష్టించిన తెలుగు సినిమా..

**ఆస్కార్ అవార్డు దక్కించుకున్న 'నాటునాటు'**

**బెస్ట్ ఒరిజనల్ సాంగ్ విభాగంలో అవార్డు ప్రకటన**

**న్యూయార్క్**

తెలుగు సినిమా చరిత్ర సృష్టించింది. బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో నామినేట్ అయిన 'ఆర్ఆర్ఆర్' సినిమాలోని 'నాటునాటు' పాటకు ఆస్కార్ అవార్డు లభించింది. సినీ చరిత్రలో అత్యంత ప్రతిష్టాత్మక అవార్డుగా భావించే ఆస్కార్ పురస్కారాన్ని అందుకుంది తెలుగు చిత్రం ఆర్ఆర్ఆర్. 95వ ఆస్కార్ అవార్డుల వేడుకలో ఈ చిత్రంలోని నాటునాటు పాటకు ప్రతిష్టాత్మక ఆస్కార్ అవార్డ్ వరించింది. బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో ఆస్కార్ దక్కించుకుంది. ఆస్కార్ను దక్కించుకున్న తొలి భారతీయ గీతంగా నాటునాటు రికార్డులకు ఎక్కింది. ఈ పాటకు మొదటి నుంచి గట్టి పోటీ ఇచ్చిన టెల్ ఇట్ లైక్ ఎ విమెన్ సినిమాలో 'అప్లాజ్', బ్లాక్ పాంథర్: వకాండా ఫరెవర్ సినిమాలోని 'లిఫ్ట్ మి అప్', ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్ సినిమాలోని 'దిస్ ఈజ్ లైఫ్', టాప్ గన్ మావెరిక్ సినిమాలో 'హోల్డ్ మై హ్యాండ్' పాటలను వెనక్కి నెట్టి మరీ 'నాటునాటు' పాట ఆస్కార్ దక్కించుకుంది. ఈ పాటను ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం కీరవాణి కుమారుడు కాలభైరవ, రాహుల్

(మిగతా 2లో)





## పార్లమెంటుకు లండన్ సెగ

**రాహుల్ వ్యాఖ్యలపై తీవ్రంగా మండిపడ్డ కేంద్రం**

**క్షమాపణలు చెప్పాలని డిమాండ్**

**న్యూ ఢిల్లీ:**

భారత పార్లమెంటుకు లండన్ సెగ తగిలింది. దీంతో లోక్సభ రాజ్యసభలు గంట పాటు అధికార ప్రతిప క్ష పార్టీల సభ్యుల ఆందోళనలతో దద్దరిల్లాయి. ఇరు పక్షాలు కూడా వెనక్కి తగ్గకపోవడంతో ఉభయసభలు ప్రారంభమైన కొద్ది సేపటికే వాయిదా పడ్డాయి.ఏం జరిగింది?ఇటీవల లండన్లో పర్యటించిన కాంగ్రెస్ అగ్రనేత లోక్ సభ సభ్యుడు రాహుల్ గాంధీ.. ప్రధాని మోడీని టార్గెట్ చేశారు. అక్కడి ఓ సంస్థలో నిర్వహించిన సమావేశంలో రాహుల్ మాట్లాడుతూ.. భారత్లో ప్రజాస్వామ్యం లేదని.. నియంతృత్వ పాలన సాగుతోందని మోడీపై విరుచుకుపడ్డారు. విశ్వగురువుగా పైకి చెప్పుకొంటున్నా.. అంత సీన్ లేదన్నారు. అంతేకాదు.. ప్రతిపక్షాలు మాట్లాడాలంటే

(మిగతా 2లో)

## అనర్హులు ఓట్లు వేస్తున్నారు

**తాడేపల్లి**

ఎమ్మెల్సీ ఎన్నికలపై టీడీపీ పార్టీ కేంద్ర కార్యాలయం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ గా పరిశీలించారు. పోలింగ్ లో అక్రమాలు, వైసీపీ దౌర్జన్యాలు, అక్రమ అరెస్టులను అధినేతకు పార్టీ నేతలు వివరించారు. వివిధ ఘటనలపై కడప ఎస్పీ, తిరుపతి జిల్లా ఎస్పీ, కలెక్టర్లతో ఫోన్ లో టీడీపీ అధినేత మాట్లాడారు. ఉదయం నుంచి జరిగిన ఘటనలు అధికారులకు వివరించి

(మిగతా 2లో)



## మార్చి 21న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుమల:**

తిరుమల శ్రీవారి ఆలయంలో మార్చి 22వ తేదీన ఉగాది ఆస్థానాన్ని పురస్కరించుకొని మార్చి 21న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది. సాధారణంగా సంవత్సరంలో నాలుగుసార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు మంగళవారం

(మిగతా 2లో)





## ఇంటి నుంచే 80 ప్లస్ వారు ఓటు వేసే అవకాశం

**న్యూఢిల్లీ:**

భారత ఎన్నికల సంఘం కీలక నిర్ణయాలు తీసుకుంది. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో వినూత్న విధానాలు అమలు చేయనుంది. ఇంటి నుంచి ఓటు వేసే విధానాన్ని తొలిసారి ప్రవేశపెట్టనుంది. 80 సంవత్సరాల కంటే ఎక్కువ వయసు ఉన్న వారికి, దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు వేసే సదుపాయాన్ని రానున్న కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఈసీ కల్పించనుంది. ఈ ఏడాది మేలోగా కర్ణాటక ఎలక్షన్స్ జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా కీలక నిర్ణయాలను ప్రకటించారు. 80 సంవత్సరాల కంటే ఎక్కువ వయసు ఉన్న వారి వద్దకు ఎన్నికల సిబ్బంది ఫామ్-12డీతో వెళతారని, దాని ద్వారా ఆ ఓటరు ఓటు వేయవచ్చని సీఈసీ రాజీవ్ కుమార్ తెలిపారు.

(మిగతా 2లో)

## అమెరికాలో బ్యాంకింగ్ సంక్షోభం




**గత రెండు రోజుల్లో రెండు బ్యాంకులు మూసివేత**

**న్యూ ఢిల్లీ:**

అమెరికాలో బ్యాంకింగ్ సంక్షోభం నెలకొంది. గత రెండు రోజుల్లో రెండు బ్యాంకులు మునిగిపోయాయి. సిలికాన్ వ్యాలీ బ్యాంక్ దివాళా తీసిన తర్వాత ఇప్పుడు అమెరికా సిగ్నేచర్ బ్యాంక్ కూడా దివాళా తీసింది. ఈ మేరకు అమెరికాకు చెందిన నియంత్రణ సంస్థలు ప్రకటించాయి. దాదాపు 110.36 బిలియన్ డాలర్ల ఆస్తులను కలిసి ఉన్న సిగ్నేచర్ బ్యాంక్ ను ది ఫెడరల్ డిపాజిట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ స్వాధీనం చేసుకుంది.క్రిప్టో కరెన్సీతో ఎక్కువగా సంబంధాలున్న సిగ్నేచర్ బ్యాంక్ మూసివేయడం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. కేవలం రెండు రోజుల వ్యవధిలోనే అమెరికాలో ఇలా కీలక బ్యాంకులు మూతపడడంతో బ్యాంకింగ్ రంగంలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. అమెరికాలో ఆర్థిక సంక్షోభం సమయంలో కుప్పకూలడం ఇది రెండవ అతిపెద్ద షట్ డౌన్. అమెరికా బ్యాంకింగ్ రంగంలో అతిపెద్ద సంక్షోభం 2008 సంవత్సరం వచ్చింది. ఆ సంవత్సరం బ్యాంకింగ్ సంస్థ లెమాన్ బ్రదర్స్ దివాలా తీసింది. దీని తర్వాత అమెరికాతో సహా ప్రపంచం మొత్తం ఆర్థిక మాంద్యం ఏర్పడింది. ఆర్థిక వ్యవస్థ వెన్ను విరిగిపోయింది. అయితే ప్రస్తుతం అమెరికా బ్యాంకింగ్ చరిత్రలో మూడో అతిపెద్ద వైఫల్యం ఇదని ఆర్థిక నిపుణులు అంటున్నారు. అమెరికాలో రెండు బ్యాంకులు మూతపడగా.. అమెరికా మార్కెట్లు ఊపందుకున్నాయి. డిపాజిటర్ల సొమ్ము భద్రంగా ఉందని.. వారు తమ డబ్బును విత్ డ్రా చేసుకునేందుకు వీలుంటుందని అమెరికా ప్రభుత్వం ప్రజలకు హామీ ఇచ్చింది అయితే సిలికాన్ వ్యాలీ బ్యాంక్ సిగ్నేచర్ బ్యాంక్ లలో ఏం జరిగింది.. ఈ రెండు బ్యాంకులు ఎలా మూసివేయబడ్డాయన్ని ప్రశ్నార్థకంగా మారింది.

ప్రజా తపన
prajathapana.com
News that matters

# చరిత్ర సృష్టించిన తెలుగు సినిమా..

(మొదటిపేజీ తరువాయి)

సిప్లిగంజ్ పాడారు. ఈ పాటను చంద్రబోస్ రచించగా.. కీరవాణి సంగీతాన్ని సమకూర్చారు. నాటునాటు పాటకు ఎన్టీఆర్, రామ్చరణ్ అదిరిపోయే స్టెప్పులు వేశారు. దీనికి ప్రేమ్రక్షిత్ కొరియోగ్రాఫర్గా వ్యవహరించారు. ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్ రాజమౌళి తెరకెక్కించిన ఈ సినిమా ఇప్పటికే గోల్డెన్ గ్లోబ్, క్రిటిక్స్ ఛాయిస్ ఆవార్డులు సాధించింది.
అయితే తాజాగా ఆస్కార్ గెలుచుకున్న ఈ నాటు నాటు సాంగ్ ఇప్పటికే.. ప్రతిష్టాత్మకమైన గోల్డెన్గ్లోబ్ సహా ఎన్నో అవార్డులను గెలుచుకుంది. రిహాన్నా పాడిన లిఫ్ట్ మి అప్, టేలర్ స్విఫ్ట్ పాడిన కరోలినా, లేడీ గగా పాడిన హోల్డ్ మై హ్యాండ్ పాటలను వెనక్కి నెట్టి.. బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో గోల్డెన్ గ్లోబ్ అవార్డును కైవసం చేసుకున్న తొలి ఆసియా పాటగా నాటు నాటు నిలిచింది.

మరో ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ అవార్డు క్రిటిక్స్ ఛాయిస్ను కూడా నాటు నాటు దక్కించుకుంది. ఇందులో బెస్ట్ సాంగ్ అవార్డును నాటు నాటు సొంతం చేసుకోగా.. ఉత్తమ విదేశీ భాషా చిత్రం అవార్డును 'ఆర్ఆర్ఆర్' అందుకుంది. కరోలినా, సియావో పపా, హోల్డ్ మై హ్యాండ్ పాటలతో నాటు నాటు పోటీపడింది. ట్రిపుల్ ఆర్ సినిమా 24 మార్చి 2022న ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది. జూనియర్ ఎన్టీఆర్, రామ్చరణ్ నటించిన ఈ సినిమా అప్పట్లో ప్రభంజనం సృష్టించింది. ఈ పాటకు వారు చేసిన డ్యాన్స్కు ప్రపంచం మొత్తం ఫిదా అయింది. తెలుగు సినిమా పాట ఆస్కార్కు నామినేట్ కావడం, అవార్డు దక్కించుకోవడం ఇదే తొలిసారి

ప్రపంచ సినిమా పెద్దన్నగా 'హాలీవుడ్' గురించి చెబుతుంటారు. మరి, అవార్డుల్లో? పెద్దన్న ఆస్కారే! ఒక భాష, ఒక ప్రాంతానికి పరిమితం కాకుండా అందరికీ తెలిసిన అవార్డులలో 'అకాడమి ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్స్'ది



అగ్ర తాంబూలం. అటువంటి అవార్డుల్లో పెద్దన్న హాలీవుడ్ మెజారిటీ అవార్డులను గెలుచుకుని, తన జైత్రయాత్ర కొనసాగిస్తున్నాడు. కొన్నేళ్లుగా జరుగుతున్నది అదే. ఆ అవార్డుల్లో మన తెలుగు సినిమాకు చోటు ఉంటుందా? ఎవరూ కలలోనూ ఊహించని అంశం. ఆ కలను సాకారం చేసిన వ్యక్తి? దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి.
'ఆర్ఆర్ఆర్ : రౌద్రం రణం రుధిరం' సినిమాతో భావి తరాలు ఆస్కార్ మీద ఆశలు కలిగించిన వ్యక్తి రాజమౌళి. ఆస్కార్ కలలు కనే ధైర్యం చేయవచ్చని భరోసా ఇచ్చిన వ్యక్తి రాజమౌళి. తెలుగు సినిమా అంటే ఉత్తమ విదేశీ చిత్రం విభాగంలో మాత్రమే పోటీ పడుతుందని ఆలోచించే వ్యక్తులకు పాటలతో మనం పోటీ పడవచ్చని దారి వేసిన వ్యక్తి రాజమౌళి. ఇప్పుడు 'నాటు నాటు...'కు అవార్డు రావడంతో 'ఆర్ఆర్ఆర్' చిత్ర బృందాన్ని, ఆ పాట రాసిన చంద్రబోస్, పాడిన రాహుల్ సిప్లిగంజ్, సంగీతం అందించిన ఎంఎం కీరవాణి, సినిమా తీసిన ఎస్ఎస్ రాజమౌళి మీద ప్రతి ఒక్కరూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఒక్కసారి గతం గుర్తు చేసుకోండి... 'ఆర్ఆర్ఆర్'లోని 'నాటు నాటు...' పాటకు అవార్డు రావడానికి ముందు ఎన్ని అనుమానాలు నెలకొన్నాయి? విడుదలకు ముందు తిట్టిన నోటి నుంచి పొగడ్తలు వస్తున్నాయి. ఉదాహరణకు... 'ఆర్ఆర్ఆర్'లో కొమురం భీం పాత్రధారి ముస్లిం టోపీ ధరించడం ఏంటి? అని బీజేపీ తెలంగాణ నేత బండి సంజయ్ ఆగ్రహావేశాలతో ఊగిపోయారు. సినిమా విడుదలైతే థియేటర్లు తగలబెడతామని ప్రగల్భాలు పలికారు. ఇప్పుడు ఆయన చిత్ర బృందాన్ని ప్రశంసిస్తున్నారు. హాలీవుడ్ అవార్డుల కోసం 'ఆర్ఆర్ఆర్' టీమ్ కోట్లకు కోట్ల రూపాయలు ఖర్చు పెడుతుందని కామెంట్ చేసిన వాళ్ళు ఉన్నారు. డబ్బులు పోసి అవార్డులను కొంటుందని విమర్శలు కూడా చేశారు. ఇప్పుడు ఆ విమర్శలను పక్కన పెట్టి ప్రశంసిస్తున్నారు. ఇప్పుడు కీరవాణి, చంద్రబోస్ ఆస్కార్ అవార్డు అందుకున్నా... హీరోలు ఎన్టీఆర్, రామ్ చరణ్ ఫారిన్ ప్రేక్షకులకు తెలిసినా... ఆస్కార్ స్టేజి మీద కాల భైరవ, రాహుల్ సిప్లిగంజ్ పాడినా... ఇదంతా రాజమౌళి చలవే. ఉత్తమ విదేశీ సినిమా విభాగంలో ఇండియా నుంచి అధికారికంగా 'ఆర్ఆర్ఆర్'ను పంపిస్తారని అందరూ ఆశించారు. అయితే... ఈ సినిమాను కాదని గుజరాతీ సినిమా 'చెల్లో షో'ను జ్యూరీ సెలెక్ట్ చేసింది. అప్పుడు వచ్చిన విమర్శలు అన్నీ ఇన్నీ కావు. 'ఆర్ఆర్ఆర్'ను పంపించకపోవడం ఏమిటని అభిమానులు ప్రశ్నిస్తే... ఉత్తరాది ప్రేక్షకులు విరుచుకుపడ్డారు. 'ఆర్ఆర్ఆర్' కమర్షియల్ సినిమా అని కామెంట్ చేశారు. ఆ విమర్శలకు రాజమౌళి తల వంచలేదు. ఇండియా నుంచి ఉత్తమ విదేశీ సినిమా విభాగంలో నామినేషన్ రాదని తెలిసి దర్శక ధీరుడు దిగాలు పడలేదు. పట్టు వదలని విక్రమార్కుడిలా ఆస్కార్ దారి ఎక్కడ ఉంది? ఎటు నుంచి ఉంది? అని అన్వేషణ చేశారు. ఆస్కార్ ముందు గోల్డెన్ గ్లోబ్, హాలీవుడ్ క్రిటిక్స్ అసోసియేషన్, ఇంకా పలు అవార్డులకు సినిమాను పంపించారు. లెజెండరీ హాలీవుడ్ దర్శకులకు సినిమా చేరువ అయ్యేలా చేశారు. 'ఆర్ఆర్ఆర్' గురించి తెలిసేలా చేశారు. ఆయన కృషికి దక్కిన ఫలితమే ఈ ఆస్కార్ అవార్డు.
ఇండియన్ సినిమా అంటే హిందీ సినిమా అని మాత్రమే అనుకునే ఫారినర్లకు తెలుగు సినిమా అనేది ఒకటుందని తెలిసేలా చేశారు రాజమౌళి. 'ఆర్ఆర్ఆర్' తెలుగు సినిమా అని ప్రపంచ సినిమా వేదికలపై చెప్పారు. తెలుగు చిత్రసీమకు గౌరవం, గుర్తింపు తీసుకొచ్చారు. ఇక నుంచి ఆస్కార్ ప్రస్తావన వచ్చిన ప్రతిసారీ రాజమౌళి పేరును భారతీయ చిత్రసీమ చెప్పుకోవాలి. 'నాటు నాటు' కంటే ముందు ఏఆర్ రెహమాన్ సంగీతం అందించిన 'జయహో' పాట ఆస్కార్ అందుకుంది. అయితే, అది తెలుగు సినిమాలో పాట కాదు, డానీ బోయెల్ అని హాలీవుడ్ దర్శకుడు తీసిన ఇంగ్లీష్ సినిమా 'స్లమ్ డాగ్ మిలియనీర్' సినిమాలోనిది. ఆ సినిమాకు మలయాళీ రసూల్ పూకుట్టి కూడా ఆస్కార్ అందుకున్నారు. వాళ్ళ కంటే ముందు కొంత మంది భారతీయులు ఆస్కార్ అందుకున్నారు. అవన్నీ హాలీవుడ్ సినిమాలకు వచ్చినవి. మొదటిసారి ఓ భారతీయ కమర్షియల్ సినిమా ఆస్కార్ అందుకోవడం 'ఆర్ఆర్ఆర్'లోని 'నాటు నాటు...'తో మొదలు అని చెప్పాలి.
ఆస్కార్ అందుకున్న తొలి భారతీయ సినిమాలో పాటగా, తెలుగు పాటగా 'నాటు నాటు...' చిరస్థాయిగా చరిత్రలో నిలిచిపోతుంది. ఆస్కార్ అవార్డ్స్ ఉన్నన్ని రోజులూ, భవిష్యత్తులో భారతీయ సినిమాలు ఆస్కార్ అవార్డు అందుకున్న ప్రతిసారీ 'నాటు నాటు'ను గుర్తు చేసుకోవాలి. ఆ పాటతో పాటు రాజమౌళి కృషిని మెచ్చుకోవాలి. ఆస్కార్ పురస్కారాల్లో భారతీయ సినిమా ప్రయాణం రాజమౌళితో మొదలైంది. చరిత్ర ఎప్పటికీ ఆయన్ను మరువదు. గుర్తు పెట్టుకుంటుంది. 'నాటు నాటు'కు ఆస్కార్ – ఇది చరిత్ర కాదు... చరిత్రకు పునాది వేసిన పురస్కారం. సరికొత్త చరిత్రకు నాంది పలికిన తరుణం. భవిష్యత్తులో ఎన్ని ఆస్కార్ అవార్డులు అయినా రావచ్చు. అయితే, ఎప్పుడూ మొదటిది ప్రత్యేకమే కదా... ఇదీ అంతే! మన దేశానికి ఈ అవార్డు ఎంతో ప్రత్యేకం.

## పార్లమెంటుకు లండన్ సెగ

(మొదటిపేజీ తరువాయి)

మైక్ ఇవ్వరని.. పత్రికలను కూడా అజమాయిషీ చేస్తున్నారని వ్యాఖ్యానించారు. అయితే.. తాజాగా ఈ వ్యాఖ్యలపై అధికార పక్షం పార్లమెంటులో నిలదీసింది. పార్లమెంట్ రెండో దశ బడ్జెట్ సమావేశాల ప్రారంభం రోజే బీజేపీ సభ్యులు కేంద్ర మంత్రులు రాహుల్ వ్యాఖ్యలను ప్రస్తావించారు. రాహుల్ వ్యాఖ్యలపై తీవ్రంగా మండిపడ్డ కేంద్ర ప్రభుత్వం.. ఆయన క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేసింది. దీంతో పార్లమెంట్ ఉభయ సభలు దద్దరిల్లాయి. లోక్ సభలో రక్షణమంత్రి రాజ్నాథ్ సింగ్ లండన్ అంశాన్ని ప్రస్తావించారు. "లండన్ గడ్డపై రాహుల్ గాంధీ భారత్ను అవమానించారు. మన దేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవాలని విదేశాలను కోరారు. ఆయన వ్యాఖ్యలను ఈ సభలోని సభ్యులంతా ఖండించాలి. రాహుల్ దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి" అని రాజ్నాథ్ డిమాండ్ చేశారు. అయితే రాజ్నాథ్ విమర్శలను కాంగ్రెస్ సభ్యులు వ్యతిరేకించారు. ప్రధాని మోడీ కూడా కాంగ్రెస్ ప్రభుత్వంపై విదేశాల్లో విమర్శలు గుప్పించారని గుర్తుచేస్తూ ఆందోళన చేపట్టారు. దీంతో ఒకింత ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో స్పీకర్ ఓం బిర్లా సభను వాయిదా వేశారు. అటు రాజ్యసభ లోనూ ఇదే విషయంపై గందరగోళం చోటుచేసుకుంది.
సభ ప్రారంభం కాగానే కేంద్ర మంత్రి పీయూష్ గోయల్.. రాహుల్ వ్యాఖ్యలను పరోక్షంగా ప్రస్తావించారు. "ఓ సీనియర్ రాజకీయ నాయకుడు విదేశీ గడ్డపై భారత ప్రజాస్వామ్యాన్ని అవమానించడం సిగ్గుచేటు. ఎమర్జెన్సీ విధించిన సమయంలో.. ఓ కాంగ్రెస్ నేత చట్టాల ప్రతులను చించేసినప్పుడు మన ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉంది. ఇప్పుడు కాదు" అని గోయల్ మండిపడ్డారు. తన వ్యాఖ్యలకు గానూ ఆ నేత(రాహుల్ను ఉద్దేశిస్తూ) క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో రాజ్యసభ కూడా వాయిదా పడింది.

## అనర్హులు ఓట్లు వేస్తున్నారు

(మొదటిపేజీ తరువాయి)

తక్షణ చర్యలు డిమాండ్ చేసారు. చంద్రబాబు మాట్లాడుతూ ఎన్నికలు ఇంత స్థాయిలో అపహాస్యం అవుతుంటే అధికారులు చర్యలు దిగకపోవడం దారుణమని అన్నారు. బస్సుల్లో, ప్రత్యేక వాహనాల్లో ఇతర రాష్ట్రాలనుంచి ప్రజలను తరలించి దొంగ ఓట్లు వేయిస్తున్నాయంత్రాంగం మౌనంగా ఉంది. పట్టభద్రులు ఓటువేయాల్సిన ఎన్నికల్లో అనర్హులతో, నిరక్షరాస్యులతో బోగస్ ఓట్లు వేయిస్తున్నారు. రాజకీయ పక్షాల ఫిర్యాదులను ఎన్నికల అధికారులు సీరియస్ గా తీసుకోవాలి. తిరుపతి లో బోగస్ ఓట్లపై అభ్యంతరాలు తెలిపిన టీడీపీ నేతలను అరెస్ట్ చేయడం దారుణమని అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో టీడీడీ ముఖ్యనేతలు యనమల, నక్కా ఆనంద్ బాబు, కొల్లు రవీంద్ర, బోండా ఉమ, టీడీ జనార్ధన్ తదితర నేతలు పాల్గొన్నారు.

## మార్చి 21న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

(మొదటిపేజీ తరువాయి)

ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఉదయం 6 నుండి 11 గంటల వరకు ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. ఆలయంలోని ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప ఆలయాలు, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుభ్రం చేస్తారు. ఈ సమయంలో స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పి వేస్తారు. శుద్ధి పూర్తి అయిన అనంతరం నామకోపు, శ్రీ చూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేస్తారు. అనంతరం స్వామివారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 గంటల నుండి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

## ఉధృతి తగ్గిన ఇన్ఫ్లుయెంజా కేసులు

**న్యూఢిల్లీ:**

ఇప్పుడిప్పుడే కాస్త కరోనా వ్యాప్తి తగ్గిపోయి ప్రపంచమంతా కుదుట పడుతోంది. నిన్న మొన్నటి వరకూ చైనాలో భారీగా నమోదైన కేసులు తగ్గుముఖం పడుతున్నాయి. మిగతా దేశాల్లోనూ పెద్దగా కేసులు నమోదు కావడం లేదు. ఇలా ఊపిరి పీల్చుకుంటున్న క్రమంలో ఇప్పుడు మరో వైరస్ దాడి చేయడం మొదలు పెట్టింది. ఊ3ఔ2 ఎనిటశ్రీబీవనిళిజీ వ్యాప్తి చెందుతోంది. సోకడమే కాదు. ఇద్దరి ప్రాణాలు బలి తీసుకుంది కూడా. కర్ణాటకలో ఓ వృద్ధుడు, హరియాణాలో ఓ వ్యక్తి ఈ వైరస్ సోకి మృతి చెందారు. ఒక్కసారిగా దేశమంతా ఈ మరణాలతో ఉలిక్కి పడింది. ఇది కూడా కరోనాలాగే పీడిస్తుందా అన్న అనుమానాలు, భయాలు వ్యక్తమవుతున్నాయి. కరోనా ప్యాండెమిక్లాగే ఇది కూడా చాలా రోజుల పాటు మనల్ని వేధిస్తుందా అని కంగారు పడిపోతున్నారంతా. ఈ వైరస్ వ్యాప్తిపై అన్ని రాష్ట్రాలనూ కేంద్ర ప్రభుత్వం అప్రమత్తం చేసింది. ఎఅఓఖీ కూడా కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. అటు నిపుణులు కూడా ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తున్నారు. కొందరు కీలక ప్రకటనలు చేశారు. ఇప్పటికైతే ఇన్ఫ్లుయెంజా కేసుల్లో పెరుగుదల సాధారణంగానే ఉందని వెల్లడించారు. ఢిల్లీలోని గంగారాం హాస్పిటల్కు చెందిన డాక్టర్ ధిరెన్ గుప్త కూడా ఇదే విషయం చెప్పారు. గత రెండేళ్లుగా కరోనా జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ఇన్ఫ్లుయెంజా వైరస్ వ్యాప్తి చెందలేదని అన్నారు. అయితే...సాధారణంగా ఈ వైరస్ ప్రాణాలు తీసేంత ప్రమాదకరమైంది కాదని వివరించారు. పిల్లల్లోనూ ఈ వైరస్ వ్యాప్తి చెందకపోవడానికి కారణం..కరోనా జాగ్రత్తలు పాటించడమేనని స్పష్టం చేశారు. ఇప్పుడు క్రమంగా ఈ జాగ్రత్తల్ని పక్కన పెట్టేశారని, అందుకే ఈ వైరస్ దాడి చేయడం మొదలు పెట్టిందని అన్నారు. "ఊ3ఔ2 వైరస్లో మ్యుటేషన్లు స్వల్పంగానే ఉంటాయి. ఇవి ప్రాణాంతకమైతే కాదు. ఇప్పటికే దీర్ఘకాలిక రోగాలతో బాధ పడే వారికి మాత్రం కాస్త ముప్పు ఉంటుంది. మృతుల్లో వీరే ఎక్కువగా ఉంటారు. మరో విషయం ఏంటంటే. వ్యాక్సిన్ల ప్రభావం ఈ వైరస్పై తక్కువగానే ఉంటుంది. అందులోనూ ఈ ఏడాది మన దేశంలో వ్యాక్సినేషన్ రేటు తక్కువగా ఉంది"
అయితే ప్రస్తుతానికి పలు చోట్ల ఈ కేసులు నమోదవుతున్నాయి. ఒడిశాలో 59 మందికి ఈ వైరస్ సోకింది. పంజాబ్, గుజరాత్లోనూ బాధితులున్నారు. ఈ కేసులు పెరుగుతుండటాన్ని చూసి ఇది కూడా కరోనా వేవ్లాగే వస్తుందా అని భయపడుతున్నారు. కానీ వైద్య నిపుణులు మాత్రం అలాంటి పరిస్థితులేమీ రాకపోవచ్చని చెబుతున్నారు. హాస్పిటలైజేషన్ చాలా తక్కువగా ఉంటుందని, పెద్దగా భయపడాల్సిన పని లేదని అంటున్నారు. కరోనా సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నామో వాటినే మళ్లీ పాటిస్తే ముప్పు తొలగిపోతుందని సూచిస్తున్నారు.

## ఇంటి నుంచే 80 ప్లస్ వారు ఓటు వేసే అవకాశం

(మొదటిపేజీ తరువాయి)

ఈ ప్రక్రియ మొత్తాన్ని సిబ్బంది వీడియో తీస్తారని తెలిపారు. ఓటరు ఎవరికి ఓటు వేశారన్న విషయం రహస్యంగానే ఉంటుందని స్పష్టం చేశారు. 80 సంవత్సరాల కంటే ఎక్కువ వయసు ఉన్న వారిని కూడా పోలింగ్ స్టేషన్లకే వచ్చేందుకు పోత్సహిస్తామని, అయితే రాలేని వారు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చని ఆయన తెలిపారు. ప్రస్తుతానికి దీన్ని కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయనుంది ఎన్నికల సంఘం. వోట్ ఫర్ హోమ్ గురించిన వివరాలను అన్ని రాజకీయ పార్టీలకు తెలియజేస్తామని సీఈసీ అన్నారు. పోలింగ్ స్టేషన్ వరకు వచ్చి ఓటు వేయలేని దివ్యాంగుల కోసం సాక్ష్యం యాప్ను తీసుకొస్తున్నట్టు సీఈసీ



వెల్లడించారు. ఈ యాప్లో లాగిన్ అయి.. ఇంటి నుంచి ఓటు వేసే ఆప్షన్ను దివ్యాంగులు ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల కోసం సువిధ పోర్టల్ ను తీసుకొచ్చినట్టు సీఈసీ రాజీవ్ కుమార్ పేర్కొన్నారు. ఈ పోర్టల్ ద్వారా అభ్యర్థులు ఆన్లైన్లోనే నామినేషన్లు, అఫిడవిట్లు దాఖలు చేయవచ్చని తెలిపారు. సభలు, సమావేశాలకు అనుమతి తీసుకునేందుకు కూడా సువిధ పోర్టల్ను అభ్యర్థులు వినియోగించుకోవచ్చని తెలిపారు. నో యువర్ క్యాండిడేట్ అనే కార్యక్రమాన్ని కూడా ఈసీఐ తీసుకొచ్చింది. నేరచరిత్ర ఉన్న అభ్యర్థులను పోటీకి ఎందుకు ఎంపిక చేశారో, ఎందుకు టికెట్ ఇచ్చారో రాజకీయ పార్టీలు.. ఓటర్లకు పోర్టల్లో, సోషల్ మీడియా ప్లాట్ఫామ్ ద్వారా సమాచారం ఇవ్వాలని వెల్లడించింది. కర్ణాటకలోని 224 స్థానాలకు ఈ ఏడాది మేలోగా అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. ఆ రాష్ట్రంలో మొత్తంగా 5.21 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని ఈసీ గణాంకాలు చెబుతున్నాయి. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ఓట్ ఫ్రం హోమ్ విధానాన్ని ఎన్నికల సంఘం అమలు చేయనుంది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా మరో ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది.

# వడివడిగా బందరు పోర్టు పనులు

**విజయవాడ:**

బందరు పోర్ట్ పనులను త్వరలో ప్రారంభించేందుకు జగన్ సర్కార్ రెడీ అవుతుంది. ఉగాది తరువాత సీఎం జగన్ నేరుగా పనులను ప్రారంభించనున్నారు. ఇందుకు అవసరం అయిన మౌలిక సదుపాయాలు పై ఎమ్మెల్యే పేర్ని నాని సమీక్ష నిర్వహించారు.. బందరు పోర్ట్ కు మరో సారి శంఖుస్థాపన ఉండదని ఇప్పటికే ప్రభుత్వ వర్గాలు ప్రకటించాయి. నేరుగా పనులను ప్రారంభం మాత్రమే ఉంటుందని, అది కూడా సీఎం జగన్ చేతులు మీదగానే ఆరంభం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. బందరు పోర్ట్ నిర్మాణ పనులు పై అనేక దశాబ్దాలుగా సందిగ్ధత కొనసాగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి రెండు సార్లు బందరు పోర్ట్ నిర్మాణ పనులను ప్రారంభించేందుకు శంఖుస్థాపన చేశారు. అయితే ఆనాటి పునాది రాళ్ళు కూడా కనుమరుగు అయిపోయాయి. పోర్ట్ నిర్మాణం జరిగితే దశాబ్దాలుగా కలలు కంటున్న స్థానికుల కల తీరుతుంది. కేంద్రం సహకారంతో అన్ని రకాల అనుమతులు తీసుకువచ్చి, నిర్మాణ పనులకు శంఖుస్థాపన కాకుండా, పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీ బాలశౌరి చెబుతున్నారు. బందరు పోర్ట్ నిర్మాణం విషయంలో స్థానిక శాసన సభ్యుడు పేర్నినాని, పార్లమెంట్ సభ్యుడు బాలశౌరి మూట/ విభేదాలు ఇప్పటికే బహిర్గతం అయ్యాయి. ఈ కారణంతోనే బందరు పోర్ట్ పనుల ను నేరుగా ప్రారంభించేందుకు రావాల్సిన ముఖ్యమంత్రి షెడ్యూల్ కూడ వాయిదా పడిందనే ప్రచారం ఉంది. అయితే తాజాగా శాసన సభ్యుడు పేర్ని నాని పోర్ట్ పనులను ప్రారంభించేందుకు అవసరం అయిన మౌలిక సదుపాయాలు పై ఆరా తీశారు. స్థానికంగా పర్యటించి, వాహనాల రాకపోకలు, ముడి సరుకు



రవాణాకు అవసరం అయిన మార్గాల ఏర్పాటు పై అధికారులతో చర్చించారు. దీంతో పోర్ట్ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ఉగాది తరువాత ముఖ్యమంత్రి జగన్ పర్యటన ఖరారు అవుతుందని చెబుతున్నారు. బందరు పోర్టు నిర్మాణానికి 5,253.88 కోట్ల రూపాయలు అవసరం అవుతాయని అంచనా వేస్తున్నారు. ఇందులో 75 శాతం బ్యాంకు రుణం, 25 శాతం ప్రభుత్వం సొంతంగా ఖర్చు చేయాలని గతంలోనే అంచనాకు వచ్చారు. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ 75 శాతం రుణం ఇచ్చేందుకు కూడ ఆమోదం లభించింది. దీంతో క్యాబినేట్ సమావేశంలో రుణం తీసుకునే అంశం పై చర్చించారు. రుణం పొందేందుకు క్యాబినేట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సముద్ర కెరటాలను అడ్డుకోవడానికి 2 కిలోమీటర్ల 325 మీటర్ల దక్షిణం, ఉత్తరం బ్రేక్స్ వాటర్ గోడల నిర్మాణాలకు రూ.446 కోట్లు అవసరం అవుతాయని ఇప్పటికే అంచనాలు కూడ రూపొందించారు. ఉత్తరం వైపున 250 మీటర్ల కొండరాళ్లతో కాంక్రీట్ గోడ నిర్మాణానికి రూ. 10. 94 కోట్లు, అలాగే దక్షిణం వైపున సడన్ బ్రేక్ వాటర్ రూ. 435 కోట్ల రూపాయలు వ్యయం అవుతుంది. డ్రెడ్జింగ్ కోసం మరో రూ.1242.88 కోట్లు, సముద్రం నుంచి ఓడలు రావడానికి అప్రోచ్ ఛానెల్ నిర్మాణానికి రూ. 706.26 కోట్లు, బ్రేక్ వాటర్ మధ్యలో ఓడలు తిరగడానికి టర్నింగ్ సర్కిల్, బెర్త్ పాకెట్స్ కోసం రూ.452.07 కోట్లు ఖర్చు అవుతుందని డీపీఆర్ రెడీ చేశారు. బందరు పోర్టులో మొదటి విడతగా 4 బెర్తుల నిర్మాణం జరుగుతుందని.. మూడు బెర్తుల కోసం రూ.548 కోట్లు, బల్క్ కార్గో కోసం ఒక బెర్త్ .. దీనికి రూ.158 కోట్లు వ్యయం అవుతుందని ఇప్పటికే ఎమ్మెల్యే పేర్ని నాని తెలిపారు. ఈ పోర్టు నిర్మాణం పూర్తయితే 80 వేల టన్నుల బరువుతో వచ్చే షిప్పులు సైతం సురక్షితంగా రాగలుగుతాయన్నారు. లక్ష నుంచి లక్షన్నర బరువుతో ఉండే షిప్పులు వచ్చే బెర్తులను సెకెండ్ ఫేజ్ లో నిర్మిస్తామన్నారు. అదేవిధంగా బందరు పోర్టు నిర్మాణానికి 1730 ఎకరాల ప్రభుత్వ భూమిలో నిర్మాణం చేస్తున్నట్లు వివరించారు. మొదటి దశలో ఒక్క ఎకరం ప్రైవేట్ భూమి కూడా తీసుకోవడం లేదన్నారు. రైల్, రోడ్డు నిర్మాణానికి 235 ఎకరాలు సేకరించాల్సి ఉందన్నారు. దీనిలో భాగంగా మూడు రోడ్ ఓవర్ బ్రిడ్జ (ఆర్వోబీ)లను నిర్మించాల్సి ఉంటుందని అధికారులు అంటున్నారు.

# మళ్లీ యాక్టివ్ అవుతున్న నల్లారి

**విజయవాడ:**

కిరణ్ కుమార్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి..! రాష్ట్ర విభజన సమయంలో కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సమైక్యాంధ్ర పార్టీని కూడా ప్రకటించారు. ఆ తర్వాత... సైలెన్స్ గా ఉండిపోయిన కిరణ్ కుమార్ రెడ్డి... తిరిగి హస్తం గూటికి చేరారు. ఈ మధ్యనే రాజకీయంగా యాక్టివ్ అవుతున్నట్లు వార్తలు వచ్చాయి. అన్నీ కుదిరితే ఏపీ కాంగ్రెస్ చీఫ్ గా బాధ్యతలు తీసుకుంటారని జోరుగా చర్చ నడిచింది. సీన్ కట్ చేస్తే.... మరో కీలక నిర్ణయం తీసుకునే దిశగా కిరణ్ కుమార్ రెడ్డి అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈనేపథ్యంలో అయన కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. బీజేపీ అగ్రనేతలతో కిరణ్ కుమార్ రెడ్డి చర్చలు జరుపుతున్నారని తెలుస్తోంది. అన్నీ కుదిరితే మరికొద్ది రోజుల్లోనే బీజేపీ కండువా కప్పుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన తర్వాత... కమలం గూటికి చేరుతారని తెలుస్తోంది. జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందన్న చర్చ నడుస్తోంది. అయితే దీనిపై బీజేపీ లేదా కిరణ్ కుమార్ రెడ్డి నుంచి క్లారిటీ రావాల్సి ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో రాజకీయాల్లో కిరణ్ కుమార్ రెడ్డి... యాక్టివ్ రోల్ పోషించారు. హస్తం



పార్టీలో రాజకీయ జీవితం ప్రారంభించిన ఆయన పలు పదవులు కూడా చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ గా పని చేశారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో 2010 నవంబర్‌లో ముఖ్యమంత్రిగా కూడా సేవలు అందించారు. ఆ సమయంలో పాలనలోనూ తన మార్క్ ను చూపించారు. విభజనను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన కిరణ్ కుమార్ రెడ్డి... సమైక్యాంధ్రా పార్టీని స్థాపించారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేకపోయారు. ఇక కిరణ్ కుమార్ రెడ్డి సోదరుడు... నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి టీడీపీలో కొనసాగుతున్నారు. 2019 ఎన్నికల్లో టీడీపీ తరపును పీలేరు నుంచి పోటీచేసిన కిషోర్ కుమార్ రెడ్డి ఓడిపోయారు. 2024 ఎన్నికలకు కూడా సిద్ధమవుతున్నారు.

# అందుబాటులోకి ఫ్లై హైదరాబాద్ సర్వీసులు

**హైదరాబాద్:**


పర్యాటక ప్రదేశాలకు హైదరాబాద్ పెట్టింది పేరు. నగర వ్యాప్తంగా ఎన్నో ప్రసిద్ధ పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. చారిత్రాత్మక కట్టడాలు, దేవాలయాలు, జూ పార్కులు వంటి ఎన్నో టూరిస్ట్ ప్లేసెస్ ఉన్నాయి. దీంతో నగర ప్రజలే కాకుండా దేశ, విదేశాలకు చెందిన ఎంతో మంది భాగ్యనగరానికి క్యూకడుతుంటారు. ప్రత్యేక ప్యాకేజీల ద్వారా పర్యాటకలను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తుంటాయి కంపెనీలు. ఈ క్రమంలోనే తాజాగా ఓ సంస్థ భాగ్య నగరంలో హెలికాప్టర్‌లో చక్కర్లు కొట్టే అవకాశాన్ని కల్పించింది. ఫ్లై హైదరాబాద్ పేరుతో కొత్త జాయ్ రైడ్ సర్వీసులను అందుబాటులోకి తెచ్చారు. మార్చి 8 నుంచి 13వ తేదీ వరకు ఈ సదుపాయం అందుబాటులో ఉండనుంది. బుద్ధ విగ్రహంతో పాటు, నెక్లెస్ రోడ్, చార్మినార్, సాలార్ జంగ్ మ్యూజియం, ఫలక్ నుమా ప్యాలెస్ ప్రాంతాల గుండా హెలికాప్టర్ రైడ్ ఉంటుంది. హెలికాప్టర్‌లో ప్రయణిస్తూ ఈ ప్రదేశాలను వీక్షించవచ్చు. 10 నిమిషాల పాటు సాగే హెలికాప్టర్ రైడ్‌ను వెయ్యి అడుగుల ఎత్తు నుంచి నగరాన్ని వీక్షించవచ్చు.

ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. నెక్లెస్ రోడ్‌లోని జలవిహార్ వాటర్ పార్క్ పక్కన దీనిని ఏర్పాటు చేశారు. టికెట్ ధరను ఒక్కొక్కరికి రూ.6,500గా నిర్ణయించారు. బుక్ మై షో ద్వారా టికెట్లను బుక్ చేసుకోవచ్చు. పూర్తి వివరాల కోసం 9797798999, 8328572041 నెంబర్లను సంప్రదించవచ్చు.

# ఉగాది తర్వాత రఘువీరా సెకండ్ ఇన్నింగ్స్...

**అనంతపురం:**

కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలను దశాబ్దాలపాటు శాసించింది. ఆ ప్రయాణంలో ఎంతోమంది నాయకులు వచ్చారు.. వెళ్లారు. వారిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న లీడర్స్‌లో ఎన్. రఘువీరారెడ్డి కూడా ఒకరు. పీసీసీ మాజీ చీఫ్. రాష్ట్ర విభజన సమయంలో సీఎం పదవికి ఆయన పేరును కూడా కాంగ్రెస్ హైకమాండ్ పరిశీలించింది. మంత్రిగానూ సుదీర్ఘకాలం పనిచేశారు. కానీ రాష్ట్ర విభజన తర్వాత రఘువీరారెడ్డి రాజకీయ ప్రయాణం సాఫీగా సాగలేదు. కాంగ్రెస్ పార్టీపై తీవ్ర వ్యతిరేకత రావడంతో ఆయన కూడా సైలెంట్ అయ్యారు. ప్రతికూల రాజకీయ వాతావరణంలోనూ కాంగ్రెస్ సారథ్య బాధ్యతలు మోసినా.. 2019 ఎన్నికల తర్వాత పొలిటికల్ స్క్రీన్ నుంచి ఆయన తప్పుకొన్నారు. రాజకీయాలకు దూరం అయ్యారు. పీసీసీ చీఫ్ పదవికి రాజీనామా చేసి తన సొంతూరు మడకశిర మండలంలోని నీలకంఠాపురానికే పరిమితం అయ్యారు. నిత్యం ఖద్దర్ బట్టలు వేసుకొని.. రాజకీయాల్లో బిజీబిజీగా గడిపిన రఘువీరారెడ్డి తన స్వగ్రామంలో ఒక ఆధ్యాత్మిక వాతావరణానికి పరిమితమయ్యారు. గ్రామంలో నీలకంఠేశ్వర స్వామి ఆలయ పునరుద్ధరణ పనులు చేపట్టారు. ప్రజల కోసం ఒక కంటి ఆసుపత్రిని కూడా తీసుకొచ్చారు.



ఇక ఈ నాలుగేళ్లలో ఊర్లో ఎప్పుడు తన పాత మిత్రులతో కలిసి తిరగడం.. రచ్చబండ మీద చర్చలు చేయడం.. పిల్లలతో ఆటలు.. పాటలు.. ఈతకొట్టడం ఇలా జీవనం సాగుతోంది. పొలాల్లో కలుపు తీశారు.. నెత్తిన గడ్డిమోపు మోశారు. ఎలాంటి భద్రత లేకుండా మోపెడ్‌పై భార్యను కూర్చోబెట్టుకుని బయటకెళ్లేవారు. రాజకీయల గురించి రఘువీరారెడ్డి మాట్లాడి నాలుగేళ్లు అయ్యింది. పాలిటిక్స్‌పై ఎవరు ఏం ప్రశ్నించినా ఆయన నుంచి మౌనమే సమాధానంగా ఉండేది. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో పాదయాత్ర ఏపీలోకి ఎంట్రీ ఇచ్చిన సమయంలో రఘువీరారెడ్డి వెళ్లి.. పార్టీ అగ్రనేతను కలిసి వచ్చారు. తన ప్రాంతం నుంచి జనాన్ని కూడా తీసుకెళ్లి రాహుల్‌గాంధీకి స్వాగతం పలికారు. అప్పుడే రఘువీరారెడ్డి మళ్లీ రాజకీయంగా యాక్టివేట్ అవుతున్నారనే చర్చ సాగింది. ఆయన మాత్రం తనకు గాంధీ కుటుంబంతో ఉన్న సాన్నిహిత్యం కారణంగానే పాదయాత్రకు వెళ్లానని స్పష్టంగా చెప్పారు. ఇంతలో రాయ్‌పూర్‌లో కాంగ్రెస్ నిర్వహించిన పార్టీ ప్లీనరీలో తళుక్కుమన్నారు రఘువీరారెడ్డి. వ్యవసాయంతోపాటు ఇరిగేషన్ అంశాలపై వేసిన ప్లీనరీ కమిటీ పగ్గాలు ఆయన చేపట్టారు. ప్లీనరీకి వెళ్లేం వచ్చాం అన్నట్టు కాకుండా? అక్కడ కీలక పాత్ర పోషించడంతో.. రఘువీరారెడ్డి వనవాసం వీడినట్టేనని చర్చ మొదలైంది. ఇక రాజకీయాలపై స్పందించాల్సింది రఘువీరారెడ్డే. ప్రస్తుతం ఏపీలో కాంగ్రెస్ పరిస్థితి ఆశాజనకంగా లేదు. మరి.. రఘువీరారెడ్డి ఏం చేస్తారు అన్నది ప్రశ్న. ఏ నిర్ణయమైనా ఆయన ఉగాది తర్వాతే ప్రకటిస్తారని తాజా చర్చ. దాంతో ఉగాది తర్వాత ఆయన ఏం చెబుతారు? ఇన్నాళ్లూ ఫక్తు రైతుగా మారిన రఘువీరారెడ్డి.. ఇకపై మళ్లీ పాత కాంగ్రెస్ నేతలా ప్రజలకు కనిపిస్తారా? యాక్టివ్ పాలిటిక్స్‌పై కాంగ్రెస్ హైకమాండ్ ఆయనకు ఏదైనా సలహా ఇచ్చిందా? దానికి ఈ మాజీ మంత్రి ఏం సమాధానం చెప్పారు? రాజకీయాల్లో తిరిగి చురుకైన పాత్ర పోషిస్తే.. వచ్చే అసెంబ్లీ లేదా పార్లమెంట్ ఎన్నికల్లో దేనికి పోటీ చేస్తారు అనేది ఉత్కంఠే..! ఈ ప్రశ్నలకు సమాధానం కావాలంటే ఉగాది వరకు ఆగాల్సిందే.

# ఉత్తమ్ వర్సెస్ రేవంత్

**నల్గొండ:**

తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే పార్లమెంటు వారీగా సమీక్షా సమావేశాలకు మొగ్గు చూపుతున్నారు. కోదాడలో ఎంపీ ఉత్తంకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశం పెద్ద రచ్చకే దారితీసింది. నియోజకవర్గానికి సంబంధం లేదని కొందరిని సమావేశానికి రావద్దని ఆదేశించారు ఓ నేత. దీంతో దారిలో ఉన్న నేతలు వెనక్కి వెళ్లిపోయారు. ఇంతవరకు బాగానే ఉంది కానీ.. అసలు తలనొప్పి నియోజకవర్గానికి సంబంధించిన నాయకులను పిలవకపోవడంతో రచ్చ రచ్చ అయ్యింది. సూర్యాపేట అసెంబ్లీ నియోజకవర్గ అంతర్గత కలహాలే తాజా వివాదానికి కారణంగా తెలుస్తోంది. సమీక్షా సమావేశంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి.. పార్టీ నేత పటేల్ రమేష్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రమేష్‌రెడ్డి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్టు దామోదర్‌రెడ్డి ఆరోపించారు. దీంతో వివాదం మొదలైంది. నల్గొండ పార్లమెంట్ సమీక్ష సమావేశానికి పటేల్ రమేష్ రెడ్డికి ఆహ్వానం లేదట. 2018 ఎన్నికల నుంచి రమేష్ రెడ్డికి.. దామోదర్‌రెడ్డికి మధ్య వైరం కొనసాగుతోంది. వచ్చే ఎన్నికల్లో టికెట్ నాదే అంటూ రమేష్ రెడ్డి పని మొదలుపెట్టారు. ఇటీవల హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో 220 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు కూడా. పార్టీ పిలుపిచ్చిన పాదయాత్రలో పాల్గొనడం కాంగ్రెస్‌కు ఎలా వ్యతిరేకం అవుతుందనేది ఆయన ప్రశ్న. అయితే ఈ గొడవ వెనుక కారణాలు వేరని కొందరి టాక్. నల్గొండ ఎంపీ ఉత్తంకుమార్ రెడ్డి తన నియోజకవర్గంలోకి రేవంత్ మనుషులని రాకుండా అడ్డుకుంటున్నారనేది రమేష్ రెడ్డి వర్గం ఆరోపణ. డిసిసి అధ్యక్ష నియామకాన్ని పెండింగ్‌లో పెట్టారు. పైగా పీసీసీ చీఫ్‌కు రమేష్‌రెడ్డి సన్నిహితుడు. వచ్చే ఎన్నికల్లో తనకు రేవంత్ టికెట్ ఇప్పిస్తారని గట్టి నమ్మకంతో ఉన్నారు. అందుకే దామోదర్‌రెడ్డిని ముందు పెట్టి రేవంత్ వర్గాన్ని సూర్యాపేటలో ఆపుతున్నారని తెలుస్తోంది.

సూర్యాపేట డీసీసీని రేవంత్.. సికింద్రాబాద్ డీసీసీని ఉత్తమ్ ఆపేశారని పార్టీలో చర్చ సాగుతోంది. ఎవరి నియోజకవర్గంలో వాళ్ల నిర్ణయం ఫైనల్ అయినప్పుడు మిగిలిన చోట్ల ఎందుకు జోక్యం చేసుకుంటారనే ప్రశ్న పార్టీ వర్గాల్లో ఉంది. సూర్యాపేట వివాదం వెనక టీ కాంగ్రెస్‌లో అంతర్గత పంచాయితీలు కారణమనే వాదన బలంగా వినిపిస్తోంది. సమస్య తీవ్రత ఎలా ఉంటుందో ఇంఛార్జ్ కూడా స్వయంగా రుచి చూశారు. మరి.. ఇంఛార్జే పరిష్కారం సూచిస్తారో.. లేక సమావేశం ఏదైనా పంతాలకే ప్రాధాన్యం ఇస్తారో కాలమే చెప్పాలి.

# మల్కాజ్ గిరి పై కమలం, గులాబీలు గురి

**హైదరాబాద్:**

కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీలు బీజేపీ, బీఆర్ఎస్‌లకు అందని ద్రాక్షగా ఉన్న మల్కాజ్‌గిరి ఎంపీ స్థానం వచ్చే ఎన్నికల్లో ఎలగైనా సాధించాలనే పట్టుదలతో రెండు పార్టీలు బలమైన నేతలను రంగంలోకి దించడానికి ప్రయత్నాలు మొదలు పెట్టాయి. పార్లమెంటు నియోజకవర్గంగా ఏర్పడినప్పటి నుంచి ఈ రెండు పార్టీలు ఈ సీటును గెలవలేదు. మూడు సార్లు కాంగ్రెస్, ఒకసారి టీడీపీ మల్కాజ్‌గిరి ఎంపీ సీటును గెలిచాయి. పునర్వ్యభజనలో ఏర్పడ్డ ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ నేత, మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ వరుసగా రెండుసార్లు గెలిచారు. మూడో సారి జరిగిన ఎన్నికల్లో ప్రస్తుత మంత్రి మల్లారెడ్డి టీడీపీ నుంచి పోటీ చేసి ఎంపీగా గెలిచారు. నాల్గో సారి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఈ పార్లమెంటు స్థానంలో గెలిచారు. అధికంగా ఉత్తర భారతీయ ఓటర్లు, అధిక శాతం హైదరాబాద్ నగర ఓటర్లు ఉన్న మల్కాజిగిరి పార్లమెంటు సీటును ఎలాగైనా రాబోయే ఎన్నికల్లో గెలవాలనే పట్టుదలతో బీజేపీ ఉన్నట్లు కనిపిస్తోంది. ఎన్నో రాష్ట్రాలకు ఇన్‌చార్జిగా పని చేసి బీజేపీని గెలిపించిన పార్టీ జాతీయ నాయకుడు మురళీధర్‌రావును మల్కాజ్‌గిరి నుంచి బరిలో దింపుతున్నట్లు సమాచారం. మల్కాజ్‌గిరి పార్లమెంట్‌కు ఎలాంటి సంబంధం లేని మురళీధర్‌రావు తరుచూ నియోజకవర్గ పరిధిలోని వివిధ సెగ్మెంట్లలో తన పేరుపై కార్యక్రమాలు నిర్వహిస్తూ పట్టుకోసం యత్నాలు చేస్తున్నారు. డిసెంబర్‌లో డబీల్‌పూర్ ఇస్కాన్ మందిరంలో మురళీధర్‌రావు నేతృత్వంలో గవర్నర్ తమిళిసైని రప్పించి హోమా లు నిర్వహించి అందరినీ అక్క డకు పిలిచారు. రెండు నెలల క్రితం కుత్బుల్లాపూర్ ఉత్తర భారతీయు లతో కార్యక్రమం నిర్వహించారు. తాజాగా డబీల్‌పూర్‌లో గోదావరి హారతి కార్యక్రమాలను చేపట్టా రు. ఇలా ఏదో ఒక కార్య క్రమం చేస్తూ ఈ జాతీయ నేత హల్‌చల్ చేస్తున్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఆయన మల్కాజ్‌గిరి నుంచి పోటీ చేస్తారని బీజేపీ కార్యకర్తలు చెబుతున్నారు. మేడ్చల్‌లో బీజేపీకి కాస్తో..కూస్తో.. పట్టున్నప్పటికీ బలమైన నాయకుడు ఆ పార్టీలో కనబడటం లేదు. అర్ధ బలం, ప్రజా బలం ఉన్న నాయకుడు లేకపోవడంతో ఆ పార్టీ బలమైన అభ్యర్థి వేటలో ఉంది. పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఎన్నిక కావడంతో నాటి నుంచి రాజకీయాలకు దూరంగా ఉన్న మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్‌ను పార్టీలోకి చేర్చుకుని మేడ్చల్ నుంచి పోటీకి దింపాలని పార్టీ పెద్దలు యోచిస్తున్నట్లు సమాచారం. కేఎల్ఆర్‌తో పలు దఫాలు చర్చలు చేశారని ఆయన రెండు, మూడు నెలల్లో పార్టీలో చేరతారని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి మల్కాజిగిరి పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన మంత్రి మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డికి ఈ సారి ఆ పార్టీ టికెట్టు ఇస్తుందో..లేదో.. అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఆయన ఓడినప్పటికీ ఆయనకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పదవిని ఆ పార్టీ అధిష్టానం ఇచ్చినా.. ఆయన పూర్తిగా నియోజకవర్గంలోని అన్ని సెగ్మెంట్లలో కనిపించలేదు. కేవలం మేడ్చల్‌కు పరిమితమయ్యారుతరుచూ మంత్రి కేటీఆర్, సీఎం కేసీఆర్‌లతో టచ్‌లో ఉన్నప్పటికీ ఎదుటి పార్టీలు బలమైన అభ్యర్థులను రంగంలోకి దించాలనే వ్యూహంతో ఉండటంతో బీఆర్ఎస్ నుంచి ఎవరూ రంగంలో ఉంటారనే ప్రశ్నకు ఇప్పుడు సమాధానం దొరకడం కష్టమే.

# పరిగిలో ఎమ్మెల్సీ పోలింగ్


**పరిగి**

వికారాబాద్ జిల్లా పరిగిలో ప్రారంభమైన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ .పరిగి నియోజకవర్గంలో మొత్తం 467 ఓట్లకు గాను 4 ఎన్నికల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేశారు పోలీసులు. పోలింగ్ కేంద్రాలలో ప్రశాంతంగా కొనసాగు తున్నాయి. పిఆర్టియు ,టియుపిఎస్ తదీతర యునియన్లు తాము భారీ మెజార్టీతో గెలుపొందుతామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో ని నాలుగు పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంతంగా ఎన్నికలు జరుగు తున్నాయి.

ప్రజా తపన
prajathapana.com
News that matters

## ఓటు హక్కు వినియోగించుకున్న తిరుపతి ఎంపీ గురుమూర్తి, వారి సతీమణి

**ఏర్పేడు**



సోమవారం జరుగుతున్న శాసనమండలి ఎన్నికలో తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, అయన సతీమణి చీకట్ల నవ్య కిరణ్ వారి సొంత మండలం అయిన ఏర్పేడులో ఓటు హక్కు వినియోగించుకొన్నారు. ఓటింగ్ అనంతరం ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ విద్యారంగంలో గాని నిరుద్యోగ సమస్య తీర్చడంలో కానీ జగన్మోహనరెడ్డి గారు తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పుల వలన మా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాం ప్రసాద్ రెడ్డి, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఘన విజయం సాధిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## విజయనగరంలో పోలింగ్ ప్రశాంతం

**విజయనగరం**

జిల్లాలో 72 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 8-00 గంటలకు ప్రారంభమైన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది. కలెక్టర్ సూర్యకుమారి జిల్లా కేంద్రంలోని కస్పా నగర పాలక ఉన్నత పాలక ఉన్నత పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.. జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఉదయం పూట ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునే ప్రయత్నం చేయాలని సూచించారు. ఓటు వేసేటపుడు సమయం వృధా కాకుండా వీలైనంత త్వరగా ఓటు వేయాలని సూచించారు.

## కారు, లారీ ఢీ..నలుగురు మృతి

**నిజామాబాద్**



నిజామాబాద్ జిల్లా ఇండల్వాయి మండలం చంద్రాయన్ పల్లి వద్ద జాతీయ రహదారి పై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వచ్చి అదుపు తప్పిన లారీ కారును ఢీ కొట్టింది. ఘటనలో నలుగురు మృతి చెందారు. మృతులు మహారాష్ట్ర లోని బిలోలికి చెందిన వారిగా గుర్తించారు

## జడ్పీ ఉన్నత పాఠశాలలో పోలింగ్

**కుత్బుల్లాపూర్**

కుత్బుల్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని రెండు పోలింగ్ కేంద్రాల్లో మ్మడి మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఉపాధ్యాయ నియోజక వర్గం యం.ఎల్.సి ఎన్నికల పోలింగ్ కొనసాగింది. ఓటర్లకు కాలవాల్సిన సదుపాయాలను అధికారులు, పోలీసులు ఏర్పాటు చేసారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు...

## లారీ అసోసియేషన్ రాస్తారోకో

**కాగజ్ నగర్**

కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్నగర్ పట్టణంలోని ఈఎస్ఐ గేటు వద్ద లారీ అసోసియేషన్ సభ్యులు రాస్తారోకో చేపట్టారు. సిర్పూర్ పేపర్ మిల్లు (ఎస్.పి.ఎం) యాజమాన్యం రోడ్ల పై గోడల నిర్మాణం వలన వాహనదారులకు, లారీలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపించారు. గోడలు కూల్చి వేయలని ఇ ఎస్.ఐ ప్రధాన రహదారి పై రాస్తారోకో నిర్వహించారు. రహదారికి అడ్డంగా అక్రమంగా నిర్మించిన గోడను కూల్చాలని లారీ అసోషియేషన్ అద్యక్షుడు కిశోర్ బాబు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య యత్నం చేసాడు. అయనను పోలీసులు అడ్డుకున్నారు.

## చంద్రబోస్ స్వగ్రామంలో సంబరాలు

**జయశంకర్ భూపాలపల్లి**

సినీ గేయ రచయిత చంద్రబోస్ కు ఆస్కార్ అవార్డ్ రావడంలో అయన స్వగ్రామం చల్లగరిగేలో గ్రామస్థులు సంబరాలు జరుపుకున్నారు. బెస్ట్ ఒరిజినల్ సాంగ్ కేటగిరీలో నాటు నాటు పాట ఆస్కార్ గెలుచుకోవడంపై హర్షం వ్యక్తం చేసారు. మిఠాయిలు పంచి బాణసంచ కాల్చి సంబరాలు జరుపుకున్నారు

## విద్యార్థులకు అస్వస్థత

**అమలాపురం**

అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం బండారు లంకలోని ఓ స్కూల్‌లో 20 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. పలువురు విద్యార్థులు స్పృహ తప్పి పడిపోవడంతో ఉపాధ్యాయులు వారిని దగ్గరలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పాఠశాలకు సమీపంలో ప్లాస్టిక్ వ్యర్థాలకు నిప్పుపెట్టడంతో.. వెలువడిన పొగతో ఊపిరాడక విద్యార్థులు ఉక్కిరిబిక్కిరి అయినట్లు సమాచారం. ఈ ఘటన సమాచారం తెలుసుకున్న వెంటనే కలెక్టర్ హిమాన్షు శుక్లా ఏరియా ఆసుపత్రికి చేరుకుని చిన్నారులను పరామర్శించారు.

# భారీగా తగ్గిన రబీ సాగు

**కాకినాడ:**



ఈ తడవ రబీ సాగు విస్తీర్ణం బాగా పడిపోయింది. సీజన్ సాధారణ సాగులో పది లక్షల ఎకరాలకుపైన బీడు పడింది. ఖరీఫ్‌లో వర్షాభావం, తుపాన్లు, వరదల వలన సేద్యం తగ్గడం కద్దు. ఆ లోటు రబీలో భర్తీ అవుతుంది. కానీ ఎన్నడూ లేని విధంగా ఈ మారు రబీలో లక్షలాది ఎకరాలు సాగు లేక ఖాళీ పడ్డాయి. రబీలో ఆహార ధాన్యాల సాగు ఎక్కువ. అందులోనూ వరి, పప్పుధాన్యాలు అధికంగా సాగు చేస్తారు. ఈ సారి ఆ పంటలు పది లక్షల ఎకరాల్లో సాగు కాలేదు. ప్రధాన ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు బానే ఉన్నాయి. భూగర్భ జలాలకు కొరత లేదు. అయినప్పటికీ రబీ సాగు భారీగా తగ్గడానికి పంటలకు గిట్టుబాటు ధరలు లేమి, వ్యవసాయ ఉత్పాదకాల ధరలు, పెట్రోలు, డీజిల్ ఛార్జీలు, కల్తీ, నకిలీ విత్తనాలు, ప్రకృతి విపత్తులు, వరి సాగుపై ప్రభుత్వ ఆంక్షలు, రైతులకు సర్కారు నుంచి అంతగా లభించని తోడ్పాటు... ఇత్యాది కారణాల వలన రబీ సాగు తగ్గిందని, రైతులు అనాసక్తి చూపారని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రబీ ప్రారంభం నుంచీ సాగు ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కి అన్న చందంగా నడిచింది. మామూలుగా ఫిబ్రవరి చివరాఖరుకి సీజన్ ముగుస్తుంది. మార్చిలో నీటి వనరులున్న ప్రాంతాల్లో వరి నాట్లు వేస్తారు మార్చి 9 నాటికి మొక్కజొన్న, కుసుమలు, పొద్దుతిరుగుడు వంటి చిన్న చితకా పంటలు తప్ప తతిమ్మావన్నీ ఈ సారి తగ్గాయి. రబీలో 58 లక్షల ఎకరాల్లో పంటల సాగును ప్రభుత్వం టార్గెట్‌గా పెట్టుకుంది. సీజన్ నార్మల్ 57.30 లక్షల ఎకరాలు. ఇప్పటికి 46.52 లక్షల ఎకరాల్లో పంటలు వేశారు. దాదాపు 10.78 లక్షల ఎకరాల్లో (19 శాతం) సాగు లేదు. గతేడాది కంటే సుమారు 6.95 లక్షల ఎకరాల్లో సేద్యం తగ్గింది. ఆహార ధాన్యాలు 10.05 లక్షల ఎకరాల్లో (19 శాతం) తగ్గాయి. వరి 17 శాతం, ముతక ధాన్యాలు 7 శాతం, పప్పుధాన్యాలు 25 శాతం తగ్గాయి. ముతక ధాన్యాల్లో మొక్కజొన్న మాత్రం నార్మల్‌కు మించి 18 శాతం ఎక్కువ సాగైంది. సజ్జ, రాగి, చిరుధాన్యాలు తక్కువ సాగయ్యాయి. రబీలో వరికి సమానంగా పప్పుధాన్యాలు సాగు చేస్తారు. కాగా ఈ మారు వాటి సాగు పడిపోయింది. పప్పుల్లో ఎక్కువ సాగు చేసే శనగ సైతం ఈ సారి తగ్గింది. 30 శాతం విస్తీర్ణంలో శనగ సాగు కాలేదు. కర్నూలు, నంద్యాల, కడప, అనంతపురం, ప్రకాశం, గుంటూరులో శనగ సాగు బాగా తగ్గింది. మినుములు 17 శాతం, పెసలు 33 శాతం తగ్గాయి. రబీలో నూనెగింజల సాగు తక్కువ. అందులోనూ 14 శాతం సాగు కాలేదు.

# మళ్లీ 16న ఉద్యోగ సంఘాలతో భేటీ

**గుంటూరు:**

ఉద్యోగ సంఘాల నేతలతో మంత్రివర్గ ఉపసంఘం నిర్వహించిన చర్చలపై ప్రభుత్వం ఒక స్పష్టతనిచ్చింది. చర్చల సారారశాన్ని, అంగీకరించిన అంశాలను రాతపూర్వకంగా ఇవ్వాలని ఉద్యోగ సంఘాల నేతలు డిమాండ్ చేయడంతో తాజాగా ప్రభుత్వం అధికారికంగా తన నిర్ణయాలను ప్రకటించింది. ఇందులో కొన్ని అంశాలను ఎప్పటిలోగా పరిష్కరిస్తామన్న దానిపైనా వివరణ ఇచ్చింది. ప్రధానంగా పెండింగ్‌లో ఉన్న జిపిఎఫ్, మెడికల్ అలవెన్సులు, ఇతర అరశాలతోపాటు 12వ పిఆర్‌సి, డిఎ వంటివాటిపైనా స్పష్టత ఇచ్చింది. కొద్ది రోజుల క్రితం జరిగిన సమావేశంలో చెప్పినట్లుగానే ఈ నెలాఖరునాటికి జిపిఎఫ్ బకాయిలు, మెడికల్ రీయింబర్స్‌మెరట్, హెల్త్ స్కీమ్ నిధులు, బీమా, టిఎ వంటివి చెల్లించనున్నట్లు, దీనికి సుమారు రూ.3 వేలకోట్లు వ్యయం అవుతుందని ప్రభుత్వం పేర్కొంది. ఆర్జిత సెలవులు, పించనుదారులకు గ్రాట్యూటీ కూడా నెలాఖరులోగా ఇవ్వనున్నట్లు ప్రకటించిరది. మరికొన్ని అంశాలను సెప్టెంబరులోగా పరిష్కరించనున్నట్లు పేర్కొంది. 2018 జులై ఒకటి, 2019 జనవరి ఒకటికి సంబంధించిన డిఎ బకాయిలను, ఆర్జిత సెలవులను రెరడు విడతలుగా చెల్లిరచనున్నట్లు పేర్కొంది. ప్రతియేటా సొంత ఆదాయం రూ.1.25 లక్షల కోట్లు వస్తురడగా, అందులో రూ.90 వేల కోట్ల వరకు ఉద్యోగుల జీతాలు, పిరఛన్లకు చెల్లిస్తున్నట్లు వివరించిరది. అయినప్పటికీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని పేర్కొంది. 12వ వేతన సవరణ, ఇతర ఉద్యోగ సంబంధిత అంశాలపై ఈ నెల 16న మరోసారి ఉద్యోగ సంఘాల నేతలతో భేటీ కానున్నట్లు వివరించిరది. అన్ని అంశాలపై ప్రతినెలా తొలి, రెండో సోమవారాల్లో ఉద్యోగులతో చర్చించాలని అన్ని శాఖలకూ ఆదేశాలు జారీ చేశారు. సిఎస్ స్థాయిలో కూడా నెలకోసారి సమావేశం నిర్వహిరచనున్నారు. గురుకులాలు, విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నురచి 62 ఏళ్లకు పెంచే విషయం కోర్టులో ఉరదని, తరువాత దీనిపై నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించింది. ఇక ప్రభుత్వ నిర్ణయాలను అధ్యయనం చేసిన అనంతరం ఉద్యోగ సంఘాలు ఎలాంటి ఉద్యమ విధానాలు అవలంభిస్తాయో చూడాల్సి ఉంది.

## అన్నదాతలకు రూ”5 కే భోజనం అమలుకు రాష్ట్ర ప్రభుత్వ యోజన

**హైదరాబాద్**

తెలంగాణలోని వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో రైతులకు రూ.5కే భోజన సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. దీనికి సంబంధించిన విధివిధానాలను త్వరలో ఖరారు చేయనుంది. రాష్ట్రంలో 192 ప్రధాన మార్కెట్ యార్డులు, 87 ఉప యార్డులున్నాయి. వీటన్నింటికీ కలిపి సీజన్ సమయంలో రోజూ 8 వేల నుంచి 10 వేల మంది వస్తుంటారు. మార్కెట్ యార్డుల్లో ప్రస్తుతం భోజన సౌకర్యాలు లేవు. ధాన్యం, ఇతర పంట ఉత్పత్తులను తీసుకొచ్చే రైతులు రోజంతా యార్డులోనే ఉంటారు. ఒక్కోసారి రాత్రిపూట సైతం అక్కడే ఉండాల్సి వస్తుంది. సమీపంలో ఉన్న క్యాంటీన్లు, హోటళ్లకు వెళ్లి భోజనాలు చేస్తారు. అధిక శాతం యార్డుల్లో మంచినీటి వసతి కూడా లేదు. ఈ నేపథ్యంలో రైతులకు రాయితీపై భోజన సౌకర్యం కల్పించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అన్నపూర్ణ పథకం ద్వారా నగరాలు, పట్టణాలు, ఆసుపత్రుల్లో సహాయకుల కోసం రూ.5కి భోజనం అందిస్తున్నారు. ఒక్కో భోజనానికి ప్రభుత్వం రూ.21 రాయితీ చెల్లిస్తోంది. ఈ పథకాన్ని మార్కెట్ యార్డులకూ విస్తరించాలని భావిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా రోజుకు 10 వేల మంది రైతులకు భోజన సౌకర్యం కల్పించేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా 36 రైతుబజార్లు ఉన్నాయి. వీటికి వేయి మందికి పైగా రైతులు కూరగాయలు తెస్తున్నారు. రైతుబజార్లలోనూ భోజన వసతుల్లేవు. అక్కడా రూ.5కి భోజన సౌకర్యం కల్పించనున్నారు.

# ఢిల్లీ ఎమ్మెల్యేల జీతాలు పెరుగుదల

**న్యూఢిల్లీ:**

మార్చి 17 నుండి ప్రారంభమయ్యే ఢిల్లీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశానికి ముందు ఎమ్మెల్యేల జీతాలు, అలవెన్సులు 66 శాతానికి పైగా పెరిగాయి. . గత ఏడాది జూలై 4వ తేదీన ఎమ్మెల్యేల జీతాలు పెంచుతూ ఢిల్లీ అసెంబ్లీ తీర్మానం చేసింది. ప్రస్తుతం ఆ నిర్ణయానికి భారత రాష్ట్రపతి ఆమోదం లభించింది. 12 ఏళ్ల తర్వాత ఢిల్లీ ఎమ్మెల్యేల జీతాలు పెరిగాయి. ఢిల్లీ అసెంబ్లీలో ఉన్న మొత్తం 70 మంది జీతాలు ఫిబ్రవరి 14 నుంచి అమలులోకి రానున్నాయి. ఢిల్లీ ప్రభుత్వ లా డిపార్ట్‌మెంట్ నోటిఫికేషన్ ప్రకారం, ఎమ్మెల్యేలకు ఇప్పుడు నెలకు రూ. 90 వేలు లభించనుంది. గతంలో రూ.54,000 మాత్రమే ఉన్న జీతాలు అమాంతం పెంచుతూ ఢిల్లీ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి, మంత్రులు, స్పీకర్, డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్, ప్రతిపక్షనేతలకు కూడా జీతం, అలవెన్సులు నెలకు రూ.72 వేల నుంచి రూ.1 లక్షా 70 వేలకు పెంచినట్లు నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఎమ్మెల్యేల మూల వేతనాన్ని నెలకు రూ.12 వేల నుంచి రూ.30 వేలకు, మంత్రులకు నెలకు రూ.20 వేల నుంచి రూ.60 వేలకు పెంచారు. రోజువారీ భత్యం కూడా రూ.1000 నుంచి రూ.1500కి పెంచారు. జులై 2022లో ఢిల్లీ అసెంబ్లీ ఎమ్మెల్యేలు, మంత్రుల జీతాలను పెంచుతూ ఢిల్లీ అసెంబ్లీ తీర్మానాన్ని ఆమోదించింది. ఈ ప్రతిపాదనకు రాష్ట్రపతి ఆమోదం లభించడంతో.. లా డిపార్ట్‌మెంట్ జీతాల పెంపునకు సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఇక పెంచిన ఎమ్మెల్యే వేతనాలు ఫిబ్రవరి 14 నుంచి అమల్లోకి రానుంది. ఇక, మాజీ శాసన సభ్యుల పెన్షన్లు కూడా పెరిగాయి. ఇంతకు ముందు కేవలం నెలకు రూ.7,500 అందుకునే వారంతా ఇక నుంచి నెలకు 15,000 రూపాయలు అందుకోనున్నారు. జీతాల పెంపు తర్వాత ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ విప్ దిలీప్ కుమార్ పాండే స్పందించారు. ప్రస్తుతం ఎమ్మెల్యేల జీతాలు పెరిగినప్పటికీ..ఈ జీతాలు ఇతర రాష్ట్రాల ఎమ్మెల్యేల జీతాలతో పోల్చితే తక్కువేనని గుర్తుచేశారు. 2015లో ఓ సారి ఢిల్లీ ప్రభుత్వం ఎమ్మెల్యేల జీతాలు పెంచడానికి ప్రయత్నించింది. 2.10 లక్షల నెల జీతం ఇవ్వాలని ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను కేంద్ర హోంశాఖ కొట్టిపారేసింది.

## గల్ఫ్ బాధితులు ఆదుకుంటాం

**జగిత్యాల**

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిని గల్ఫ్ బాధితుల సంఘం సోమవారం కలిసింది. బాధితులు తమ సమస్యలను రేవంత్ దృష్టికి తీసుకెళ్లారు. గల్ఫ్ బాధితుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. కేసీఆర్ ప్రభుత్వం గల్ఫ్ బాధితులను ఆదుకుంటామని హామీ ఇచ్చి మోసం చేసిందని బాధితులు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గల్ఫ్ బాధితులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని రేవంత్ హామీ ఇచ్చారు.

## విశాఖలో ప్రశాంతంగా పోలింగ్

**విశాఖపట్నం**

జరుగుతున్న శాసనమండలి పట్టభద్రు ల ఎమ్మెల్సీ ఎన్నికలలో విశాఖకు చెం దిన పలువురు రాజకీయ నేతలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నా రు. బిజెపి అభ్యర్థి పివిఎన్ మాధవ్ ఆంధ్ర యూనివర్సిటీ హైస్కూల్లోని 248 పోలింగ్ బూత్ లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. టిడిపి అభ్యర్థి వి.చిరంజీవి రావు ఆంధ్ర యూనివర్సి టీ లోని రూమ్ నెంబర్ 123 లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరితోపాటు బిజెపి రాజ్యసభ సభ్య లు జీవీఎల్ నరసింహారావు, తెలుగు దేశం పార్టీ ఎమ్మెల్యేలు వెలగపూడి రామకఅష్ణ బాబు, గంట శ్రీనివాసరా వులు, ఎంవిపి కాలనీ గిరిజన భవన్ ఏర్పాటు చేసిన 225 పోలింగ్ కేంద్రంలో వారి ఓటు హక్కులను వినియోగించు కున్నారు. జిల్లా అధికారులు, పోలీసు యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేశా రు.

## దుగ్గిరాలపాడులో ఉద్రిక్తత

**విజయవాడ**

ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం దుగ్గిరాలపాడు లో గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఆంజనేయ స్వామి దేవాలయానికి గ్రామస్తులు కేటాయించుకున్న ప్రభుత్వ భూమిలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టొదని గ్రామస్తులు ఆందోళనకు దిగారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మేము వ్యతిరేకం కాదు కానీ మరొక స్థలం లో నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేసారు. టెంట్ వేసుకొని నిరసన తెలిపారు. గుడి స్థలంలో భవిష్యత్తులో ఏదైనా ఆలయ నిర్మాణం చేపట్టాలంటే అవకాశం ఉండదు కనుక వ్యతిరేకిస్తున్నామని దుగ్గిరాలపాడు గ్రామస్తులు అన్నారు. పోలీసులు రంగప్రవేశం తో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎట్టిపరిస్థితుల్లోనూ ఇక్కడ కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని అడ్డుకుంటామని గ్రామస్తులు అంటున్నారు.

## నకిలీ ఓటర్ గుట్టు రట్టు

**తిరుపతి**

సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు తిరుపతి జీవకోన ఏరియాలో బూత్ నెంబర్ 233, 234 లో ఓటు వేయడానికి వెళు న్న నకిలీ ఓటరు ఒకరు కెమెరాకు చిక్కారు. ఓటర్లను ప్రశ్నించినప్పుడు 10వ తరగతి చదువుకున్నానని ఓటరు చెప్పిన విషయం వీడియోలో స్పష్టంగా నమోదైంది. ఈ ఘటనతో అధికార పార్టీ నకిలీ ఓటర్లను చేర్పించినట్లు స్పష్టంగా రుజువైందని సిపిఎం నేత వి శ్రీనివాస్ రావు ఆరోపించారు. కాబట్టి ఇప్పటికైనా నకిలీ ఓటర్లు ఓటు వేయకుండా అడ్డుకునే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్ ని సిపిఎం కోరుతున్నదని అయన అన్నారు.

## కవితకు వినూత్నంగా విషెస్

**హైదరాబాద్:**



బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జన్మదినం నేడు. 1978 మార్చి 13వ తేదీన జన్మించారు. కవిత పుట్టిన రోజును పురస్కరించుకొని ఆమె అభిమానులు , బీఆర్ఎస్ కార్యకర్తలు సోషల్ మీడియాలో విషెస్‌తో హోరెత్తిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదినం సందర్భంగా నిజామాబాద్ కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు చిన్ను గౌడ్ వినూత్నంగా శుభాకాంక్షలు తెలియజేసి అభిమానాన్ని చాటుకున్నాడు. అండమాన్ నికోబార్ దీవుల్లో బంగళా ఖాతం సముద్రపు అంచుల లోకి వెళ్లిన చిన్నుగౌడ్, ఇతరులు ఎమ్మెల్సీ కవితకు జన్మదిన శుభాకాంక్షలతో కూడిన బ్యానర్లను ప్రదర్శించారు. నీటి అడుగున డైవింగ్ చేస్తూ బ్యానర్లను ప్రదర్శించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీనంతటినీ వీడియోగా చిత్రీకరించారు. దీనికి సంబంధించిన వీడియోను టీస్ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్ గారి చేతుల మీదుగా ఆదివారం రాత్రి 12 గంటలకు విడుదల చేశారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఇదిలా ఉంటే ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొన్న కవిత శనివారం ఈడీ విచారణ ఎదుర్కొన్న విషయం తెలిసిందే. ఇక కవితను మరోసారి 16వ తేదీన ఈడీ విచారణకు హాజరుకావాల్సిందింగా ఆదేశించిన విషయం విదితమే. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న కవిత పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొంటారో లేదో చూడాలి.

# నిజామాబాద్ లోకి రేవంత్ యాత్ర

**నిజామాబాద్:**

టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి హాత్ సే హాత్ జోడో యాత్ర నిజామాబాద్ క్యాడర్‌లో జోష్ నింపనుంది. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా నిజామాబాద్ జిల్లా పార్లమెంట్ లోని 5 నియోజకవర్గాల్లో పాదయాత్రలు, రైతులతో సమావేశాలు, బీడీ కార్మికులతో సమావేశాల్లో పాల్గొననున్నారు. జిల్లాలో ఉన్న పెండింగ్ పనులను సందర్శించనున్నారు. ప్రతి నియోజకవర్గంలోని జిల్లా కాంగ్రెస్ నాయకులతో ప్రత్యేక భేటీలు నిర్వహించనున్నారు రేవంత్ రెడ్డి. జిల్లాలో మంచిప్ప రిజర్వాయర్ రీ డిజైన్ ను ఆయా ముంపు గ్రామాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. మంచిరిజర్వాయర్ సందర్శించి అక్కడి ముంపు బాధితులతో మాట్లాడనున్నారు. ఉద్యమం నుంచి బీఆర్ఎస్ పార్టీలో ఉండి ఎలాంటి పదవులు దక్కని అసంతృప్తులతో రేవంత్ రెడ్డి రహస్యంగా భేటీ కానున్నట్లు తెలుస్తోంది. రేవంత్ రెడ్డి జిల్లా పర్యటనను ఇప్పటికే కాంగ్రెస్ నాయకులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. రేవంత్ పాదయాత్రలు చేసే నియోజకవర్గాల్లో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లా ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీకి కంచుకోట. జిల్లాలో ఉన్న అన్ని నియోజకవర్గాల్లో గతంలో అసెంబ్లీ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి ఉంది. జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి నేటి స్ట్రాంగ్ క్యాడర్ ఉంది. తిరిగి జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తెచ్చే విధంగా రేవంత్ రెడ్డి పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపేలా తన యాత్ర షెడ్యూల్ ను రూపొందించారు. 14వ తేదీ ఉ10:00 గంటలకు మంచిప్ప రిజర్వాయర్ సందర్శించనున్నారు. ఇక సాయంత్రం 4:00 గంటలకు పాదయాత్ర మోపాల్ నుండి కంజర - కులాస్ పూర్-ముల్లంగి ? గన్ పూర్ మీదుగా సాగుతుంది. సాయంత్రం 7:00 గంటలకు డిచ్పల్లి రైల్వే స్టేషన్ వద్ద కార్నర్ మీటింగ్ లో పాల్గొంటారు. ఇక రాత్రి 9 గంటలకు నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలోని నిజామాబాద్ నగరానికి చేరుకుంటారు. అక్కడే బస చేస్తారు. 15వ తేదీన ఉదయం 9:00 గంటలకు కంఠేశ్వర్ శివాలయం దర్శనం చేసుకుని ఉ 10:00 గంటలకు దుబ్బ అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ,సెవెజ్ ట్రిట్ మేంట్ ప్లాంట్ సందర్శిస్తారు. అనంతరం ఉ 11:00 గంటలకు అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలించనున్నారు రేవంత్ రెడ్డి. 12:00 గంటలకు మల్లారంలోని ప్రభుత్వ భూమిని పేదలకు పంచకుండా విక్రయించిన స్థలాన్ని పరిశీలించనున్నారు. సాయంత్రం 4:30 దుబ్బా చౌరస్తా - కెనాల్ కట్ట - నిర్మలా హృదయ కాన్వెంట్ - నామ్‌దేవ్ వాడ - రావూజీ సంఘం - సతీష్ పవార్ చౌరస్తా - శివాజీ చౌక్ - రైల్వే ఫ్లై ఓవర్ వంతెన - దేవి రోడ్ - భగత్ సింగ్ చౌరస్తా - జవహర్ రోడ్డు - పూసాల గల్లి - తుమ్మ బుచ్చయ్య క్రాస్ రోడ్డు ? గోల్ హనుమాన్ దేవాలయం - ఆర్య సమజ్ - బడా బజార్ - ఆజం రోడ్ నెహ్రూ పార్క్ వరకు పాదయాత్ర చేసి అక్కడే కార్నర్ మీటింగ్ లో ప్రసంగించనున్నారు రేవంత్ రెడ్డి. అక్కడి నుంచి రాత్రి 9 గంటలకు బోధన్ నియోజకవర్గం శాటాపూర్ చేరుకుంటారు అక్కడ బస చేసి 16వ తేదీ ఉ 9:00 గంటలకు సారంగాపూర్ వద్ద ప్రాణహిత-చేవెళ్ల పంపు హౌస్ ను సందర్శిస్తారు. ఉ 10:00 గంటలకు నవీపేట్ గ్రామంలో మార్కండేయ ఆలయ సందర్శన అనంతరం రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు రేవంత్ రెడ్డి తిరిగి సాయంత్రం 4:00 గంటలకు ఎడపల్లి వివేకనంద విగ్రహం నుండి బోధన్ అంబేద్కర్ చౌరస్తా వరకు పాదయాత్ర చేసి అనంతరం కార్నర్ మీటింగ్ లో ప్రసంగిస్తారు రేవంత్ రెడ్డి. అక్కడి నుంచి రాత్రి 9 గంటలకు ఆర్మూర్ నియోజకవర్గానికి చేరుకుని పెర్కిట్ హైవే పక్కన బస చేస్తారు. 17-03-2023 ఉ 9:00 గంటలకు సిద్దుల గుట్ట ఆలయాన్ని సందర్శిస్తారు. సాయంత్రం 4:00 గంటలకు పెర్కిట్ నుండి మామిడిపల్లి ? ఆర్మూర్ కొత్త బస్టాండ్ ?అంబేద్కర్ చౌరస్తా - పాత బస్టాండ్ వరకు పాదయాత్ర చేసి అక్కడ కార్నర్ మీటింగ్ లో పాల్గొంటారు రేవంత్ రెడ్డి ఇక్కడితో రేవంత్ రెడ్డి జిల్లా పర్యటన ముగుస్తుంది.



# రెడీ అవుతున్న 19వ ఫ్లై ఓవర్

**హైదరాబాద్:**

హైదరాబాద్ ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులను శాశ్వతంగా దూరం చేసే లక్ష్యంతో జీహెచ్ఎంసీ చేపట్టిన స్ట్రాటెజిక్ రెడ్ డెవలప్ మెంట్ ప్రాజెక్టులో మరో పని పూర్తయింది. 19వ ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయి త్వరలోనే అందుబాటులోకి రానుంది. వనస్థలిపురం నుంచి ఎల్బీనగర్ వచ్చే దారిలో కూడలిలో కుడివైపు నిర్మితమైన వంతెన ప్రారంభానికి సిద్ధమైంది. 22.55 కోట్ల వ్యయంతో 760 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పుతో ఈ ఫ్లైఓవర్ ను నిర్మించారు. ఈనెల 13వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. 16వ తేదీన కౌంటింగ్ జరగనుంది. ఈ ప్రక్రియ ముగిసిన వెంటనే మార్చి 18వ తేదీన తర్వాత పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఓ ఫ్లైఓవర్ ను ప్రారంభించనున్నట్లు సమాచారం. ఐటీ కారిడార్ లో ట్రాఫిక్ క్ సమస్యలు, సిగ్నల్ లేని ప్రయాణం సాగించేలా కొత్త సంవత్సరం కానుకగా రాష్ట్ర ప్రభుత్వం మరో కొత్త ఫ్లైఓవర్ ను అందుబాటులోకి తీసుకు వచ్చింది. ఐటీ కారిడార్ కు మరో మణిహారంగా కొత్తగూడలో నిర్మాణం పూర్తయిన ఫ్లైఓవర్, అండర్ పాస్ లను మున్సిపల్ శాఖా మంత్రి కేటీఆర్ ఆదివారం ప్రారంభించారు. ఈ కొత్త కారిడార్ తో ఆల్విన్ కాలనీ నుంచి గచ్చిబౌలి జంక్షన్ వరకు సిగ్నల్ లేని ప్రయాణం చేసే వీలు ఉంటుంది. అయితే గచ్చిబౌలి జంక్షన్ నుంచి బొటానికల్ గార్డెన్, కొండాపూర్, కొత్తగూడ, ఆల్విన్ కాలనీ, మాదాపూర్ ప్రాంతాలకు ఈ ఫ్లైఓవర్ మీది నుంచి ఎలాంటి ఆటంకం లేకుండా రాకపోకలు సాగించవచ్చు.మౌలిక వసతుల రంగంలో హైదరాబాద్ దూసుకెళ్తోంది. ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేలా తెలంగాణ ప్రభుత్వం వ్యూహాత్మంగా భారీగా ఫ్లైఓవర్ల నిర్మాణం చేపట్టింది. అవన్నీ నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. వరుసగా ఓపెనింగ్‌కు వస్తున్నాయి. కొత్త ఏడాది తొలి రోజున షేక్ పేట ఫ్లై ఓవర్‌ను కేటీఆర్ ప్రారంభించారు. రేతిబౌలి నుంచి ఆరులేన్లతో షేక్ పేట్ , ఫిలింనగర్ జంక్షన్ ఓయూ కాలనీ, విస్పర్ వ్యాలీ జంక్షన్ వరకు ఈ ఫ్లైఓవర్ నిర్మించారు. షేక్‌పేట్ ఫ్లై ఓవర్ ఇంటర్మీడియట్ రింగ్ రోడ్ నిర్మాణం నగరంలో రెండవ అతి పెద్దది.పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే తర్వాత 2.8 కిలోమీటర్ల పొడవులో ఈ ఫ్లైఓవర్ ఉంటుంది. ఈ ఫ్లై ఓవర్‌తో హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, గచ్చిబౌలి వెళ్లే వాహనదారులకు మహా ఉపశమనం లభించనున్నది. నిర్మాణంలో భాగంగా 74 పిల్లర్స్, 72 పియర్ క్యాప్స్, 440 పి.ఎస్.సి గడ్డర్స్,144 కాంపోసిట్ గ్రీడర్స్ ఏర్పాటు చేశారు. జనవరి మూడో నుంచి ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వచ్చింది. అంతకంటే మూడు రోజుల ముందే మిథాని- ఒవైసీ ఫ్లై ఓవర్‌ను కేటీఆర్ ప్రారంభించారు. హైదరాబాద్‌లో అత్యంత బిజీగా రూట్లలో ఒకటి ఎల్‌బినగర్ చాంద్రాయణగుట్ట రూట్ . ఈ రూట్‌లోనే మరో ఫ్లై ఓవర్ అందుబాటులోకి వచ్చింది.

# బుద్ధవనానికి క్యూ కడుతున్న జనాలు

**నల్గొండ:**



బుద్ధవనం! ప్రపంచంలోని బౌద్ధులకు అదొక పవిత్ర భూమి! ప్రకృతితో మమేకమైన ఆ ప్రదేశంలో నడుస్తున్నంత సేపు ముక్తిమార్గం బోధ పడుతుంది. పూలవనంలో విహరిస్తున్నంత సేపు సమ్యక్ దృష్టి అంటే ఏంటో అవగతమవుతుంది! అనుభవం రుజువు కాని ఏ విషయాన్ని బుద్ధుడు అంగీకరించలేదు! ఆ వనంలో తిరుగుతున్న ప్రతీ ఒక్కరిలో అదే భావన కలుగుతుంది! అడుగు పెట్టగానే మనసంతా నిర్మల మనస్సుతో ధ్యానంలోకి వెళ్లిపోతాం! కనుచూపు మేరలో పచ్చదనం మరోలోకంలోకి తీసుకుపోతుంది! తీరొక్క పూల బృందావనం జీవకారుణ్య ఔన్నత్యాన్ని ఎత్తిచూపుతుంది!మొత్తం 279 ఎకరాలు! బుద్ధవనం పేరుతో తెలంగాణ ప్రభుత్వం అందంగా తీర్చి దిద్దింది. గౌతమబుద్ధుడి సమకాలీనంలోనే ఇక్కడి 14 మంది యువకులు బుద్ధుని శిష్యరికం చేసి, బౌద్ధమత వ్యాప్తి చేశారు అనేది చరిత్ర. ఇక్కడ దొరికిన శాసనల్లోనూ అదే ఉంది! ఆచార్య నాగార్జునుడు విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసి విద్యను అందించారు. అంత గొప్ప చరిత్ర గల పవిత్ర భూమి నాగార్జున సాగర్. సాగర్ డ్యాం నిర్మాణం సమయంలో జరిపిన తవ్వకాల్లో ఈ చరిత్ర బయల్పడింది. 1926లో మెట్టమెదటిసారి చారిత్రక ఆధారాలు దొరికాయి. ఆ తర్వాత భారత ప్రభుత్వం 1953 నుంచి 1963 వరకు ఇక్కడ తవ్వకాల్ని చేపట్టింది. ఆ తవ్వకాల్లో బుద్ధుడి జీవిత విశేషాలు, ఆచార్య నాగార్జునుడి విశ్వ విద్యాలయం, అప్పటి వస్తువులు, చారిత్రక ఆధారాలు అన్ని బయటపడ్డాయి. వాటన్నింటినీ మ్యూజియం ఏర్పాటు చేసి భద్రపరిచారు. వాటితోపాటు బౌద్ధవారసత్వాన్ని ప్రపంచానికి చాటేలా, బుద్ధుని జీవిత విశేషాల్ని, బుద్ధిజం గొప్పదనాన్ని, ఆయన శిష్యుల సమాచారాన్ని, అష్టాంగమార్గాలను ఈతరానికి పరిచయం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం నాగార్జున సాగర్ లో బుద్ధవనాన్ని నిర్మించింది. భూటాన్, టిబెట్, సౌత్ కొరియా, కాంబోడియా, వియత్నాం, శ్రీలంక, మయన్మార్, థాయ్ లాండ్, నేపాల్, మలేషియా, తైవాన్, చైనా ఇలా ప్రపంచంలోని అనేక దేశాల నుంచి ప్రతిరోజు పదుల సంఖ్యలో బౌద్ధ భిక్షువులు ఈ బుద్ధవనాన్ని సందర్శించడానికి వస్తుంటారు. మినిమం వారంరోజుల పాటు ఉంటారు. ప్రత్యేక ప్రార్ధనలు, ప్రవచనాలు, ధ్యానం చేసుకుంటూ ప్రశాంతంగా గడుపుతారు. ఇక్కడికి వచ్చే బౌద్ధ భిక్షువులకు ప్రత్యేకంగా వసతి సదాపాయాలు కల్పించింది ప్రభుత్వం. వారి ఆహార అలవాట్లకు తగ్గట్టుగా వంటలు వండి పెడ్తారు! వేకువ జాము నుంచే ఆచరించే పద్దతులకు అనుగుణంగా ప్రత్యేక సదుపాయాల్ని కల్పించింది టూరిజం శాఖ. ప్రపంచంలోని, దేశంలోని వివిధ యూనివర్సిటీల విద్యార్థులు ఇక్కడికివచ్చి పరిశోధనలు చేస్తున్నారు. వారికి కూడ ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేసింది ప్రభుత్వం. టూరిజం శాఖ ఇక్కడ ప్రత్యేక కాటేజీలను నిర్మించింది. విజయ్ విహార్, హరిత ప్లాజా పేరుతో ప్రత్యేక హోటల్స్ ఇక్కడ అందుబాటులోకి తెచ్చింది ప్రభుత్వం. అందుకే బౌద్ధులు, వివిధ దేశాల విద్యార్థులు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఈ వాతావరణాన్ని ఎంజాయ్ చేస్తున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన బుద్ధచరిత వనం, బోధిసత్వవనం, ఆచార్య నాగార్జున వనం, మహాస్థూపం, స్థూపవనం, అవకాన బుద్ద పార్క్, ఎంట్రన్స్ ప్లాజా, జాతక పార్క్, చరితవనం, 36 అడుగుల ఎత్తైన బుద్ధుడి ఏకశిలా విగ్రహం, బౌద్ధవిహారాలు, స్థూపాలు, ధ్యానమందిరం, అంతర్జాతీయ విజ్ఞాన కేంద్రం, మ్యూజియం, కన్వెన్షన్ హాల్, రిసార్టులు, ఫుడ్ కోర్టులు, బోటింగ్, బుద్ధుడి పాదుకలు ఇలా అణువణువై కళ్లు చెదిరే శిల్పకళా వైదూష్యంతో బుద్ధవనం అలరారుతున్నది. ఎటు చూసినా పచ్చటి వనం! 3వేల రకాల పూల మెక్కలు అహ్లాదాన్ని పంచుతున్నాయి. బుద్ధవనం గొప్పతనాన్ని తెల్సుకోవాలని దలైలామా ఇక్కడికి వచ్చి ఒకరోజు ఉండి ఇక్కడ బోధి వృక్షాన్ని నాటి శాంతి సందేశం ఇచ్చి వెళ్లారు. ఆరోజు నుంచి ఈ ప్రాంతం బుద్ధులకే కాదు, అష్టాంగ మార్గాన్ని అనుసరించడం ద్వారా దుఃఖాన్ని తొలగించుకోవచ్చన్న ప్రతీ ఒక్కరు ఇక్కడికి వచ్చి బుద్ధుని ఆరాధనలో మునిగిపోతున్నారు! ఎన్నో అంతర్జాతీయ అవార్డులు దక్కించుకున్న ఈ బుద్ధవనాన్ని టైం దొరికినప్పుడు మీరూ సందర్శించండి!

# మార్చి 16 నుంచి భట్టి పాదయాత్ర

**అదిలాబాద్:**



తెలంగాణ కాంగ్రెస్ నేతలు పాదయాత్రల బాట పట్టారు. ఇప్పటికే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, సీనియర్ నేత మహేశ్వర్ రెడ్డి పాదయాత్రలు చేస్తున్నారు. తాజాగా కాంగ్రెస్ పార్టీ నేత భట్టివిక్రమార్క కూడా పాదయాత్ర ప్రారంభిస్తున్నట్లు కార్యదర్శి రోహిత్ చౌదరి ప్రకటించారు. హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్ర కొనసాగింపుగా ఈనెల 16 నుంచి జూన్ 15 వరకు 91 రోజులపాటు పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నెల 16న ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గంలోని బజార్ హత్నూర్ మండలం పిప్పిరి గ్రామంలో సాయంత్రం 4 గంటలకు పాదయాత్రను ప్రారంభించనున్నారు. పార్టీ తెలంగాణ ఇంఛార్జ్ ఠాక్రే ఆదేశాలతో తెలంగాణలో కాంగ్రెస్ నేతు హత్ సే హత్ జోడో అభియాన్ యాత్ర కొనసాగిస్తున్నారని వెల్లడించారు.ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు మొత్తం 39 నియోజకవర్గాల్లో 1365 కిలోమీటర్ల మేర భట్టి విక్రమార్క పాదయాత్ర రూట్‌మ్యాప్ రెడీ చేశారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేరాలని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇచ్చిందని, కానీ బీఆర్ఎస్ దశాబ్ద పరిపాలనలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నిర్వీర్యం చేసిందని భట్టి విక్రమార్క ఆరోపించారు. నిరాశ నిస్పృహల్లో ఉన్న ప్రజలకు ధైర్యం ఇచ్చి వారికి మేము అండగా ఉన్నామని చెప్పడానికే తాను పాదయాత్ర చేస్తున్నట్లు భట్టి తెలిపారు.భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ ఇచ్చిన సందేశాన్ని హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్ర కొనసాగింపుగా చేస్తున్న పాదయాత్ర ద్వారా ప్రతి గడపగడపకు తీసుకువెళ్తామన్నారు భట్టి విక్రమార్క. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు చేస్తున్న పాదయాత్రలో అన్ని జిల్లాల అధ్యక్షులు, పీసీసీ ఉపాధ్యక్షులు, పీసీసీ ప్రధాన కార్యదర్శులు, పీసీసీ సభ్యులు, పార్టీ యంత్రాంగాన్ని భాగస్వాములు చేసే పర్యవేక్షణ ంఎఅఅ నిర్వహిస్తుందన్నారు. మంచిర్యాల, హైదరాబాద్ శివారు, ఖమ్మంలో భారీ బహిరంగ సభలు ఉంటాయన్నారు.

# దృష్టి లోపం లేని తెలంగాణే ప్రభుత్వ ధ్యేయం

## మంత్రి పువ్వాడ

## కంటి వెలుగు శిబిరం ప్రారంభం

**ఖమ్మం**



దృష్టి లోపాలను నివారించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెండవ విడుత కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టి విజయవంతంగా అమలు చేస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు.ఖమ్మం కార్పోరేషన్ 14వ డివిజన్ లోని జెడ్పి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని మంత్రి పువ్వాడ ప్రారంభించారు.రాష్ట్ర ప్రభుత్వ జనవరి 19వ తేదీన లాంఛనంగా ప్రారంభించిన ఈ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతున్నదని, జూన్ వరకు నిర్వహించే రెండవ విడుత కంటి వెలుగులో జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఉన్న వైద్య బృందాలు పర్యటించి ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు.కంటి వెలుగు వైద్య శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, శిబిరాలకు వచ్చిన ప్రజలకు వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి వారికున్న దృష్టిలోపాన్ని బట్టి రీడింగ్ గ్లాసులను పంపిణీ చేస్తున్నారన్నారు.దూరపు చూపు సమస్య ఉన్న వారికి కండ్లద్దాలను ఆర్డర్ ఇచ్చి వచ్చిన తరువాత పంపిణీ చేస్తున్నారని, వీటితో పాటు విటమిన్ ఏ, డీ, బీ కాంప్లెక్స్ మాత్రలు, కండ్లల్లో వేసుకోవడానికి చుక్కల మందును అందజేస్తున్నారన్నారు. శిబిరాలు నిర్వహిస్తున్న ప్రతి చోట ప్రజలు కంటి పరీక్షలు చేయించుకుంటున్నారని, ఎవ్వరూ దృష్టిలోపం లేకుండా మంచు చూపుతో ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టిందన్నారు.ఈ సందర్భంగా కళ్ళఅద్దాలను పంపిణీ చేశారు. అనంతరం డి ఎం అండ్ హేచ్ ఓ మాలతీ తో మాట్లాడి జిల్లా వ్యాప్తంగా కంటి వెలుగు శిబిరాల నిర్వహణ వివరాలు అడిగితెలుసుకున్నారుకార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, జిల్లా కలెక్టర్ వి పి గౌతమ్, సుడా చైర్మన్ విజయ్, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణా, కూరాకుల వలరాజ్, దేవభక్తిని కిషోర్ బాబు, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# వికారాబాద్ లో వింత ఘటన

**హైదరాబాద్:**

వికారాబాద్ జిల్లాలో వింత ఘటన చోటుచేసుకుంది. పోతులూరి వీరబ్రహ్మం గారు కాలజ్ఞానంలో చెప్పిన వింతలు, విడ్డూరాలు అప్పుడప్పుడూ ఎక్కడో ఓ చోట జరుగుతూ ప్రజలను ఆశ్చర్యపరుస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం గొట్లపల్లి గ్రామంలో ఓ వింత ఘటన చోటుచేసుకుంది. గ్రామంలోని హిదయత్ ఇనాయత్ అలీ అనే రైతు దగ్గర పెంచుకుంటున్న మేక.. ఓ మేక పిల్లకు జన్మనిచ్చింది. ఇందులో వింతేముందని అనుకుంటున్నారా.. అక్కడికే వస్తున్నా.. ఆ పుట్టిన మేక పిల్ల అన్నింటిలా లేదు మరి. ఆ మేక పిల్లకు ఒకటే కన్ను ఉంది. ఆ ఒక్క కన్నుతో పుట్టిన మేక పిల్లను చూసేందుకు.. జనం తండోపతండాలుగా వచ్చి ఆసక్తిగా చూస్తున్నారు. అయితే.. ఈ ఘటన చూసిన స్థానికులు.. బ్రహ్మంగారు చెప్పినట్టే వింతలు జరుగుతున్నాయని.. అందులో ఒకటే ఈ ఒంటి కన్ను మేకపిల్ల అంటూ చెవులు కొరుక్కుంటున్నారు.కాగా.. గతంలోనూ ఇలాంటి ఘటనలు అక్కడక్కడా జరుగుతూనే ఉన్నాయి. మేక పిల్లకు నాలుగు కాళ్లకు బదులు ఎనిమిది కాళ్లు ఉండటం.. మేకపిల్ల ఇంకో జంతువులా ఉండటం.. ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. గతేడాది నిర్మల్ జిల్లా భైంసా మండలం సుంక్లి గ్రామంలో మనిషిని పోలిన పిల్లను మేక ప్రసవించించింది. ఆ మేక పిల్లకు తల, కాళ్లు, చేతులు మనిషిని పోలిన విధంగా ఉండటం ఆసక్తికరం. అయితే.. ఒంటి కన్ను ఉన్న మేకపిల్ల జన్మించటం మాత్రం ఇదే మొదటి సారి అంటున్నారు స్థానికులు. మరోవైపు.. ఇలాంటివన్ని జన్యుపరమైన లోపాలంటున్నారు పశువైద్యులు. మరి ఇది నిజంగానే జన్యులోపమో.. లేదా బ్రహ్మం గారు చెప్పింది నిజమవుతుందో.. కాలమే నిర్ణయిస్తోంది.

# కేసీఆర్ తర్వాతే నేనే

**హైదరాబాద్**

రాజకీయాల్లో నంబర్ వన్ ఎవరు.. ఆ తర్వత ఎవరు? అనే చర్చ సాగుతూనే ఉంటుంది.. కొన్ని సందర్భాల్లో అది వివాదాలకు కూడా దారి తీస్తుంది.. ఇప్పటికే బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ తర్వాత నంబర్ ఎవరిది? అనే చర్చ ఎప్పటి నుంచో సాగుతోంది.. రెండు మూడు పేర్లు ప్రముఖంగా వినిపిస్తుంటాయి.. అయితే, అనూహ్యంగా ఇప్పుడు కేసీఆర్ తర్వాత నేనే నంబర్ వన్ అంటున్నారు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు. వరంగల్ జిల్లా పర్వతగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1987?88 పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న మంత్రి.. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ విషయాన్ని ప్రస్తావించారు.. అందుకు తగిన కారణం కూడా చెప్పుకొచ్చారు.. తన తండ్రి సమితి అధ్యక్షునిగా పోటీ చేసినప్పుడు టాస్ వేసి కాంగ్రెస్ వారు ఓడించారని చెప్పుకొచ్చారు.. అలా రెండు సందర్భాల్లో ఆ పార్టీ వారు కక్ష గట్టడంతో కసితో.. తాను తెలుగుదేశం పార్టీలో చేరానన్నారు.. జిల్లా అధ్యక్షుడిగా పని చేసిన సందర్భాల్లో కాంగ్రెస్ పార్టీని అన్ని నియోజకవర్గాల్లో ఓడించాచని పేర్కొన్నారు..ఇక, తన రాజకీయ ప్రస్థానం గురించి మాట్లాడిన ఎర్రబెల్ల దయాకర్‌రావు.. ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో కేసీఆర్ తర్వాత తానే సీనియర్‌ని అన్నారు.. తన అంత సీనియర్ ఇంకా ఎవరూ లేరన్న ఆయన.. వరుసగా 30 ఏళ్ల నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధిస్తున్నానని ఈ సందర్భంగా పేర్కొన్నారు.. కసికొద్దే రాజకీయాల్లోకి వచ్చా.. రాణించా.. గతంలో ఎమ్మెల్యే కంటే పెద్ద పదవిగా భావించే సమితి ప్రెసిడెంట్ పదవికి తన తండ్రి పోటీ చేస్తే.. కాంగ్రెస్ టికెట్ ఇచ్చినట్టే ఇచ్చి మరో వర్గంతో తన తండ్రిని ఓడించిందని ఆవేదన వ్యక్తం చేశారు.. అలా కాంగ్రెస్ మీద వ్యతిరేకతతో కక్ష సాధించాలనే ఉద్దేశంతోనే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. అంతేకాదు.. కాంగ్రెస్ ను నాశనం చేయాలని కంకణం కట్టుకొని టీడీపీలో చేరా.. వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశా.. ఆ సమయంలో జిల్లాలోని 12 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయేలా చేశానని గుర్తు చేసుకున్నారు.. అయితే, ఎర్రబెల్లి తన రాజకీయ ప్రస్తానం.. తన అనుభవాలను చెప్పుకొచ్చినా.. ముఖ్యమంత్రి కేసీఆర్ తర్వాత నేను సీనియర్.. నంబర్ వన్ తర్వాతే.. నంబర్ నాదే అనే విధంగా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో చర్చగా మారాయి.

## తండ్రిని ఇంట్లో పెట్టి నిప్పు పెట్టిన కూతురు

**నిజామాబాద్**

మానవత్వం మంటగలిసిపోతుంది. రోజురోజుకూ మానవ బంధాలు, అనుబంధాలు విలువ లేకుండా పోతోంది. ఆస్తి, డబ్బు ఉంటే చాలు కుటుంబాన్ని కడతేర్చడానికి కూడా వెనకడాటం లేదు. చిన్నప్పటి నుంచి కని పెంచిన తల్లిదండ్రులను సైతం చంపేందుకు ప్లాన్ వేస్తున్నారు. ఆస్తికోసం అల్లారు ముద్దుగా పెంచిన కన్నబిడ్డలే తల్లిదండ్రులపై కర్కసత్వాన్ని చూపుతున్నారు. వారిని చంపేస్తే వారి ఆస్థి తన సొంతం అవుతుందనే దురాశ కల్లు మూసుకుపోయేలా చేస్తుంది. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను కంటికిరెప్పలా చూసుకోవాల్సిన పిల్లలు.. వారిపాలిట యమపాశాలుగా మారుతున్నారు. ఆస్తులు పంచివ్వకపోతే.. తల్లిదండ్రులను సైతం మట్టుబెట్టేందుకు వెనకాడటం లేదు. తండ్రి ఆస్థి కోసం ఓ కూతరు చేసిన దారుణం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన తెలంగాణ రాష్ట్రం కామారెడ్డి జిల్లా రాజంపేట మండల కేంద్రంలో జరిగింది.ఆంజనేయులు అనే వ్యక్తి కామారెడ్డి జిల్లా రాజంపేటలో నివాసం ఉంటున్నాడు. అతనికి ఒక కూతరు ఉంది. అయితే వీరిద్దరి మధ్య కొంతకాలంగా ఆస్తి వివాదం కొనసాగుతోంది. అయితే కూతురికి ఆస్తి ఇచ్చేందుకు తండ్రి ససేమిరా అన్నాడు. తన ప్రాణం పోయినా సరే ఆస్తి ఇవ్వనని ఖరాఖండిగా చెప్పాడు. దీంతో తండ్రి పై కోపం పెంచుకున్న కన్న కూతురు తండ్రిని చంపేందుకు ప్లాన్ వేసింది. తండ్రిని చంపి ఎలాగైనా తన ఆస్తి కొట్టేయాలనుకుంది. అలా చేసి ఆత్మహత్యగా చిత్రీకరించాలని అనుకుందో ఏమో గానీ .. తండ్రి ఒక్కడే ఇంట్లో ఉండడాన్ని గమనించింది అయితే తండ్రి బయటకు రాకుండా ఇంటికి తాళం వేసింది. బయటకు వచ్చిన కూతురు ఇంటికి నిప్పు పెట్టింది. అంతే తండ్రి కాపాడండి అని అరుస్తున్నా కనికరం లేకుండా చూస్తూ ఆనంద పడింది కూతురు. అయితే అరుపులతో తండ్రి నిప్పుల్లో కాలి పోయి చివరకు ప్రాణాలు వదిలాడు. అయితే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడడంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు నిందితురాలిని అదుపులో తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కోడిపందాల గుట్టు రట్టు

**గూడూరు**

గూడూరు మండలం చంబడి పాలెం గ్రామంలో కోడిపందాలు ఆడుతున్న ముఠాపై దాడి చేసి 9 మందిని అరెస్టు చేశామని వారి వద్దనుండి లక్ష 1500 రూపాయల నగదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని గూడూరు డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి వెల్లడించారు గూడూరు పట్టణంలోని రూరల్ పోలీస్ స్టేషన్ లో డి.ఎస్.పి సూర్యనారాయణ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు కోడిపందాల ముఠా సభ్యులను నగదును మీడియా ముందు ప్రవేశపెట్టారు డీఎస్పీ మాట్లాడుతూ గూడూరు మండలంలోని చంబడి పాలెం లో కోడిపందాలు ఆడుతున్నారని సమాచారంతో ఎస్సై సిబ్బంది దాడి చేశారని కొంతమంది పరారయ్యారని 9 మందిని అదుపులోకి తీసుకున్నామని వీరి వద్దనుండి ఒక లక్ష 1500 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు పెద్ద మొత్తంలో ఎప్పుడు నగదు పట్టుకోలేదని కోడి పందాలు నిర్వహించే ముఠా నిర్వాహకుల కోసం ప్రత్యేక గాలింపు చేపట్టామని ఈ రైడ్ లో పాల్గొన్న సిబ్బందికి రివార్డ్ రోల్ కోసం ఎస్పీకి పంపిస్తున్నామని అన్నారు ఈ సమావేశంలో రూరల్ సీఐ దశరథ రామారావు ,ఎస్సై బ్రహ్మనాయుడు ,సిబ్బంది పాల్గొన్నారు

# ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో సీబీఐకి సుప్రీంకోర్టులో చుక్కెదురు

**సీబీఐ విచారణపై సుప్రీంకోర్టు**

**స్టేటస్ కో విధింపు**

**న్యూఢిల్లీ :**

ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో సీబీఐకి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. సీబీఐ విచారణపై సుప్రీంకోర్టు స్టేటస్ కో విధించింది. తదుపరి విచారణ తేదీ వరకు స్టేటస్‌కో కొనసాగుతుందని జస్టిస్ సంజీవ్ కన్నా, జస్టిస్ సుందరేశ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. ఎలాంటి పేపర్లు, డాక్యుమెంట్స్ సీబీఐకి ఇవ్వొద్దని ఉన్నతన్యాయస్థానం తెలిపింది. ఇప్పుడు విచారణ కొనసాగించవద్దని... చాలా స్పష్టంగా తెలియజేస్తున్నట్లు పేర్కొంది. విషయం తమ వద్ద ఉన్నప్పుడు విచారణ కొనసాగించవద్దన్న సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. లేకుంటే తాము మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వవలసి ఉంటుందని హెచ్చరించింది.
సుప్రీంకోర్టుకు వేసవి సెలవుల తర్వాత విచారణ చేపట్టనున్నట్లు ధర్మాసనం తెలిపింది. జులై 31 నుంచి ప్రారంభమయ్యే వారంలో మిస్ లేనియస్ పిటిషన్ కింద విచారణ జరుపుతామని పేర్కొంది. అప్పటివరకు యధాతధ స్థితి కొనసాగుతుందని స్పష్టం చేసింది. కేసు దర్యాప్తు సీబీఐకి అప్పజెప్పారా అని



తెలంగాణ న్యాయవాదులను ప్రశించగా.. లేదని చెప్పిన న్యాయవాదులు తెలిపారు. ఈ కేసులో ప్రధానంగా రెండు విషయాలపై విచారణ చేపట్టనున్నట్లు ధర్మాసనం పేర్కొంది. కేసు మెరిట్స్, హైకోర్టులోనే అప్పీల్‌కు వెళ్లడం.. ఈ రెండు అంశాలపై వాదనలు వింటామని తెలిపింది. అప్పటివరకు కేసు దర్యాప్తులో యధాతథ స్థితి కొనసాగుతుందని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టులో విచారణ పెండింగ్‌లో ఉండగా దర్యాప్తు జరపకూడదన్నది ప్రాథమిక సూత్రమని న్యాయమూర్తి ఖన్నా తెలిపారు.
మిస్‌లీనియస్ పిటిషన్లు లేని రోజు విచారణ చేపడతామని వెల్లడించింది. మెరిట్స్ ఆధారంగా ఈ అప్పీల్ విచారణార్హమా కాదా అన్నది ముందు తేల్చాలని పేర్కొంది. ఇందుకు చాలా సమయం పడుతుందని.. అందుకే కేసును జులైకి వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. ఇప్పటి వరకు కేసు విచారణ సీబీఐకి బదిలీ అవ్వలేదని బీజేపీ తరఫు న్యాయవాది తెలిపారు. తెలంగాణ చీఫ్ సెక్రటరీకి ఎన్నిసార్లు లేఖ రాసినా స్పందన లేదని కోర్టుకు చెప్పారు. అయితే సీబీఐ విచారణపై 'స్టే' ఇవ్వాలని ప్రభుత్వం తరఫు న్యాయవాది దుష్యంత్ దవే కోరారు. అయితే స్టే ఇవ్వడానికి నిరాకరించిన సుప్రీంకోర్టు.. తదుపరి విచారణ తేదీ వరకు స్టేటస్ కో కొనసాగుతుందని స్పష్టం చేసింది.

# ఫైనల్స్ లో అర్హత సాధించిన టీమిండియా


**ముంబై:**

బోర్డర్ – గవాస్కర్ ట్రోఫీలో భాగంగా భారత పర్యటనలో ఉన్న ఆస్ట్రేలియా.. ప్రస్తుతం అహ్మదాబాద్ వేదికగా జరుగుతున్న నాలుగో టెస్టు ఫలితం తేలదని తేలిపోయినా టీమిండియాకు మాత్రం గుడ్‌న్యూస్ దక్కింది. ఈ మ్యాచ్ ఫలితంతో సంబంధం లేకుండా భారత్.. జూన్‌లో జరుగబోయే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్స్‌కు అర్హత సాధించింది. న్యూజిలాండ్ – శ్రీలంకల మధ్య క్రిస్ట్‌చర్చ్ వేదికగా ముగిసిన తొలి టెస్టులో లంకేయులు ఓడిపోవడంతో భారత్ ఫైనల్ బెర్త్ ఖాయమైంది. 2021లో కూడా భారత్.. డబ్ల్యూటీసీ ఫైనల్స్ ఆడిన విషయం తెలిసిందే. కానీ అప్పుడు ఇదే కివీస్ చేతిలో భారత్ ఓడింది. ఇప్పుడు మాత్రం కివీస్ విజయంతో భారత్ తుది పోరుకు అర్హత సాధించింది. అహ్మదాబాద్ టెస్టుకు ముందు భారత్ డబ్ల్యూటీసీ ఫైనల్స్ ఆడుతుందా..? లేదా..? అన్నది అనుమానంగానే ఉండింది. ఇండోర్ టెస్టులో ఆస్ట్రేలియా గెలిచిన తర్వాత ఆ అనుమానం మరింత రెట్టింపైన విషయం తెలిసిందే. ఈ టెస్టు ఫలితంతో భారత్ డబ్ల్యూటీసీ ఫైనల్స్ బెర్త్ ముడిపడి ఉండటంతో అందరిలోనూ ఒకటే ఉత్కంఠ. ఒకవేళ మనం ఓడినా న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లిన శ్రీలంక గెలవకూడదు. ప్రతీ టీమిండియా అభిమాని కోరిక ఇదే. వాళ్ల అభీష్టానికి అనుగుణంగానే కివీస్.. శ్రీలంకను ఓడించింది. ఐదు రోజుల పాటు ఉత్కంఠగా సాగిన టెస్టులో కివీస్.. లంకను రెండు వికెట్ల తేడాతో ఓడించింది. ఫలితంగా భారత్... తుది పోరుకు అర్హత సాధించినట్లైంది.
క్రిస్ట్‌చర్చ్ వేదికగా జరిగిన మ్యాచ్ లో శ్రీలంక తొలి ఇన్నింగ్స్ లో 355 పరుగులు చేయగా కివీస్ 373 రన్స్ చేసింది. అనంతరం లంక రెండో ఇన్నింగ్స్ లో 302 పరుగులకే ఆలౌట్ అయింది. 285 పరుగుల లక్ష్య ఛేదనలో కివీస్.. మ్యాచ్ ఆఖరి సెషన్ చివరి బంతి వరకూ విజయం కోసం పోరాడింది. చివరి ఓవర్లో కివీస్ విజయానికి 8 పరుగులు అవసరం కాగా.. తొలి రెండు బంతుల్లో రెండు పరుగులొచ్చాయి. మూడో బంతికి హెన్రీ రనౌట్ అయ్యాడు. నాలుగో బంతికి కేన్ మామ (విలియమ్సన్) బౌండరీ బాదాడు. ఐదో బంతికి సింగిల్. చివరి బంతికి బైస్ రూపంలో ఓ పరుగు తీసిన కివీస్.. థ్రిల్లింగ్ విక్టరీ కొట్టింది. ఈ ఓటమితో లంక.. డబ్ల్యూటీసీ ఫైనల్ రేసు నుంచి తప్పుకుంది. కివీస్ రెండో ఇన్నింగ్స్ లో కేన్ విలియమ్సన్ ఇన్నింగ్సే హైలైట్. ఓపెనర్లు టామ్ లాథమ్ (25) తో పాటు డెవాన్ కాన్వే (5) విఫలమైనా విలియమ్సన్ మాత్రం.. 194 బంతులాడి 11 ఫోర్లు, ఒక సిక్సర్ సాయంతో 121 పరుగులు చేసి నాటౌట్ గా నిలిచాడు. అతడికి తోడుగా తొలి ఇన్నింగ్స్‌ల్ సెంచరీ హీరో డారిల్ మిచెల్ (81) మరో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఆ తర్వాత అతడు ఔటైనా లోయరార్డర్ సాయంతో విలియమ్సన్ పని పూర్తి చేశాడు.

# వివేకానంద కేసు..31 కు విచారణ వాయిదా

**హైదరాబాద్:**

వివేకానంద రెడ్డి హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైఎస్ అవినాష్ రెడ్డి తెలంగాణ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ పై నేడు విచారణ జరిగింది. తనపై తీవ్రమైన చర్యలు తీసుకోకుండా సీబీఐని ఆదేశించాలని ఎంపీ అవినాశ్ రెడ్డి ఈ పిటిషన్ లో కోరారు. కోర్టులో విచారణ సందర్భంగా అవినాష్ రెడ్డిని విచారణ చేసి రికార్డ్ చేసిన ఆడియోలు, వీడియోలను హార్డ్ డిస్క్ లో కోర్ట్ ముందు సీబీఐ అధికారులు ఉంచారు. దాదాపు 10 డాక్యుమెంట్లు, 35 సాక్షుల వాంగ్మూలాలు, కొన్ని ఫోటోలను సమర్పించారు. హత్యా సమయంలో సాక్ష్యాల ధ్వంసంలో అవినాష్ రెడ్డి పాత్ర ఉందని సీబీఐ అధికారులు కోర్టుకు తెలిపారు. తీవ్ర చర్యలు తీసుకోవద్దని ఆదేశాలు ఇవ్వవద్దని సీబీఐ అధికారులు కోర్టును కోరారు. అయితే తీర్పును రిజర్వ్ చేసిన ధర్మాసనం, తమ తీర్పు వెల్లడించేవరకు అవినాష్ రెడ్డిని అరెస్ట్ చేయవద్దని సీబీఐని ఆదేశించింది.వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో తనను అరెస్ట్ చేయవద్దంటూ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై గత విచారణలో భాగంగా సీబీఐ కీలక విషయాలను వెల్లడించింది. ప్రస్తుతం టెక్నికల్‌గా వైఎస్ అవినాష్ రెడ్డి సాక్షిగానే ఉన్నారని సీబీఐ తెలిపింది. అవసరం అయితే అదుపులోకి తీసుకుంటామని గత



విచారణ సందర్భంగా న్యాయమూర్తికి తెలిపింది. ఇప్పటికే మూడు సార్లు అవినాష్ రెడ్డిని ప్రశ్నించామని ప్రతీ సారి వీడియో రికార్డ్ చేశామని సీబీఐ అధికారులు న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. ఆడియో, వీడియో రికార్డుల హార్డ్ డిస్క్‌ను సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్ హైకోర్టుకు తెచ్చారు. హార్డ్ డిస్క్, కేసు ఫైల్ ఇప్పుడే ఇచ్చేందుకు తాము సిద్ధమని తెలిపారు.

**వైఎస్ అవినాష్ విచారణ**

**మొత్తాన్ని రికార్డ్ చేశామన్న సీబీఐ**

వైఎస్ వివేకా హత్య కేసులో అవినాష్ రెడ్డికి సంబందించిన వివరాలు, హార్డ్ డిస్క్‌ను సోమవారం (మార్చి 13) సీల్డ్ కవర్‌లో ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. సోమవారం వరకు అరెస్టు చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని అవినాష్ న్యాయవాది ఈ సందర్భంగా కోరారు. ఈ సందర్భంగా అవినాష్‌రెడ్డి.. సాక్షా? నిందితుడా? అని సీబీఐని హైకోర్టు ప్రశ్నించింది. అవినాష్ రెడ్డికి సీఆర్‌పీసీ 160 నోటీసు ఇచ్చామని.. అవసరమైతే అవినాష్ రెడ్డి, భాస్కర్ రెడ్డిని అదుపులోకి తీసుకుంటామని తెలిపింది. దీంతో సోమవారం వరకు అవినాష్‌ను అరెస్టు చేయవద్దని సీబీఐకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అవసరమైతే మంగళవారం మరోసారి అవినాష్ విచారణకు హాజరవుతారని హైకోర్టు తెలిపింది. అయితే చెప్పింది చెప్పినట్లు వాంగ్మూలం చేస్తున్నారన్న నమ్మకం లేదని.. అవినాష్ న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. విచారణ వీడియో రికార్డింగ్ చేస్తున్నామని సీబీఐ తరఫు లాయర్ స్పష్టం చేశారు. వీడియో రికార్డింగ్ ఏ దశలో ఉందో తెలపాలని.. కేసుకు సంబంధించిన పూర్తి ఫైల్‌ను సోమవారం సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. పిటిషన్‌లో తన పేరు ప్రస్తావించినందున తన వాదనలు కూడా వినాలని సునీత కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

# విశాఖలో పోలింగ్ ప్రశాంతం

**విశాఖపట్నం**

విశాఖలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా సాగింది. ఈరోజు జరుగుతున్న ఎన్నికలలో విశాఖకు చెందిన పలువురు రాజకీయ నేతలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ, 78వ వార్డు సీపీఎం కార్పొరేటర్ బి.గంగరావులు ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలోని బూతు నెంబర్ 245లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బిజెపి అభ్యర్థి పివిఎన్ మాధవ్ ఆంధ్ర యూనివర్సిటీ హైస్కూల్లోని 248 పోలింగ్ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీడీపీ అభ్యర్థి వి.చిరంజీవి రావు ఆంధ్ర యూనివర్సిటీలోని రూమ్ నెంబర్ 123 లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ కృష్ణాకాలేజీలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరితోపాటు బిజెపి రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు, తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు వెలగపూడి రామకఅష్ణ బాబు, గంట శ్రీనివాసరావులు, ఎంవీపీ కాలనీ గిరిజన భవన్ ఏర్పాటు చేసిన 225 పోలింగ్ కేంద్రంలో వారి ఓటు హక్కులను వినియోగించుకున్నారు. జిల్లా అధికారులు, పోలీసు యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

## మంత్రి వ్యాఖ్యల దుమారం

**కళ్యాణదుర్గం**

అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం పరిధిలో పంచాయతీల వారీగా ఓటర్ల లిస్టు పరిశీలన చేస్తూ.. చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారి తీశాయి. అయితే వైరల్ అవుతున్న ఈ వీడియో పై స్పందించారు మంత్రి ఉషశ్రీ చరణ్. ఓటర్లను ప్రలోభ పెట్టారన్న అంశంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వైరల్ అవుతున్న వీడియోలో ఎటువంటి వాస్తవం లేదని.. ఆ వీడియోని మార్ఫింగ్ చేశారని ఆరోపించారు.నేను నా టేబుల్ మీద వేరే అంశం గురించి డిస్కస్ చేస్తున్నా నని.. కానీ ఆ వీడియోను మార్ఫింగ్ చేసి వైరల్ చేశారని అన్నారు. ఒక బీసీ మహిళ మంత్రి అయినందువల్ల జీర్ణిం చుకోలేక కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు మంత్రి ఉషాశ్రీ చరణ్. తాను భూములు కొన్న వివాదం చేస్తున్నారని.. ప్రజలకు వాస్తవాలు తెలుసని అన్నారు.

## రాజేంద్రనగరం లో భారీ అగ్నిప్రమాదం

**రంగారెడ్డి**

హైదరాబాద్ లోని రాజేంద్రనగర్ లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. టింబర్ డిపోలో చెలరేగిన మంటలు ఉధృతంగా మారి డిపో మొత్తం వ్యాపించినట్లు తెలుస్తోంది. హుటాహుటిన రంగంలోకి దిగిన అగ్నిమాపక దళం మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తోంది. షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం చోటు చేసుకుని ఉండవచ్చని పోలీసులు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతానికి ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని స్పష్టం చేశారు. సుమారు 8మంది సిబ్బంది నిర్విరామంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

## కండక్టర్ అత్మహత్య

**మహబూబాబాద్**

మహబూబాబాద్: తొర్రూర్ ఆర్టీసీ డిపోలో విషాదం చోటు చేసుకుంది. ఆర్టీసీ బస్సులో ఉరేసుకుని కండక్టర్ మహేందర్‌రెడ్డి ఆత్మహత్య చేసుకున్నారని తోటి సిబ్బంది చెబుతున్నారు. కండక్టర్ ఆత్మహత్యపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై తొర్రూర్ ఆర్టీసీ సిబ్బందితోపాటు అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహేందర్ రెడ్డి ఆత్మహత్యకు గల కారణాలపై వేగంగా విచారణ జరపాలని కుటుంబ సభ్యులు, బంధువులు డిమాండ్ చేస్తున్నారు.ఈ ఘటనపై సమాచారం అందడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని కన్నీటిపర్యంతమయ్యారు. మృతుడి ఆత్మహత్యకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఆర్టీసీ అధికారుల ఒత్తిడి వల్లే తమ బిడ్డ ఆత్మహత్య చేసుకున్నారని మృతుడి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపిస్తున్నారు.

## ఓటు హక్కు ను వినియోగించు కున్న ఎమ్మెల్యే




**నంద్యాల**

ప్రజాస్వామ్యం లో ఓటు హక్కు విలువ తెలిసిన ఎమ్మెల్యే శిల్పా... ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే సోమవారం క్యూలో నిలబడి రాజ్యాంగం అందించిన ఓటు హక్కును వినియోగించుకున్నారు , ప్రజాస్వామ్య విలువలను ఇనుమడింపజేసే విధంగా ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థికి ఓటు వేసి తమ ఓటహక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే సోదరి శిల్పా, సతీమణి 36వార్డ్ కౌన్సిలర్ నాగిని రవిసింగారెడ్డి కూడా క్యూ లైన్ లో వెళ్ళి ఓటు వేశారు.

# నందిగామలో టీడీపీ నిరసన

**నందిగామ**

నందిగామ గాంధీ సెంటర్ లో నందిగామ జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, శ్రీరామ్ తాతయ్య తదితరులు వినూత్న రీతిలో నిరసన తెలియజేసారు. జగనన్న ధాన్యం డబ్బులు జగనన్న ధాన్యం డబ్బులు అని రైతులు నినాదాలు చేసారు. రైతులకు ధాన్యం డబ్బులు వెంటనే చెల్లించాలని సెంటర్ లో కూర్చుని భిక్షాటన చేసారు. నందిగామ జగ్గయ్యపేట నియోజకవర్గలలో రైతులకు ధాన్యం డబ్బులు వెంటనే చెల్లించాలని ఆర్డీవో రవీంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు.
జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక రైతాంగం పరిస్థితి పూర్తిగా అంధకారంగా మారింది.వరి రైతులు కష్టం ఎవరు చెప్పుకోవాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఎవరు కూడా వారి బాధను అర్థం చేసుకోవడం లేదు ఈ ప్రభుత్వం గుడ్డి ప్రభుత్వం గా వ్యవహరిస్తుందని ధాన్యం పులిహోర చేసి మూడు నెలలు అవుతున్నా కూడా రైతులకు బకాయిలు చెల్లించలేదని రాష్ట్రవ్యాప్తంగా 1500 కోట్లు కృష్ణా జిల్లా వ్యాప్తంగా 80 కోట్లు కొత్త టార్గెట్ 15000 మెట్రిక్ టన్నులు ప్రభుత్వం ఇచ్చిందని మూడు నెలల నుంచి చెప్తున్నారు కానీ కొనుగోలు చేయటం లేదు కాబట్టి వరి రైతులను వెంటనే ఆదుకోవాలి రైతులకు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు...

# గోవులు స్వాధీనం

**విజయవాడ**

అక్రమంగా గత మూడు రోజులుగా గోవుల రవాణా చేస్తున్న వాహనాలు పట్టుకున్న గోరక్షకులపై కృష్ణలంక పోలీసులు అక్రమ కేసులు బనాయించారు. కృష్ణలంక సర్కిల్ ఇన్స్పెక్టర్ దుర్గారావు గోసంరక్షకులపై అసభ్య పదజాలం ఉపయోగించారని బాధితులు ఆరోపించారు. అదేమని ప్రశ్నించిన వారిని లారీ తొక్కితే ఏమి చేస్తావు అంటూ ప్రశ్నించారు.
ఎక్కువ మాట్లాడితే బొక్కలో వేసి వుతుకుతానంటు బెదిరించారు. దాంతో రాష్ట్ర గోసంరక్షణ అధ్యక్షుడు సురేష్ కుమార్ విస్తూపోయి సిఐతో వాగ్వానికి దిగారు. కలెక్టర్, పోలీసు వున్న తాధి కారులకు ఫిర్యాదు చేస్తామని సురేష్ కుమార్ అనడంతో సిఐ మరింత రెచ్చిపోయారు. ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అంటూ హేళన చేసాడు.
మానసికంగా హింసించడమే కాకుండా గోరక్షకుల్ని గోమాతని చులకన చేసినందుకు ప్రముఖ స్వామిజీ పీఠాధిపతి శివ స్వామి సోమవారం నాడు విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ మరియు హిందూ సంఘాల ఆధ్వర్యంలో పోలీస్ కమిషనర్ కార్యాలయానికి వచ్చారు. సదరు సిఐపై చర్యలు తీసుకోకపోతే గవర్నర్ కు ఫిర్యాదు చేస్తామని శివస్వామి అన్నారు. న్యాయం జరక్కుంటే ఆందోళనకు పిలుపు నిస్తామని శివస్వామి.. ఆర్ ఎస్ ఎస్ నేతలు వెల్లడించారు

# గిడుగు రుద్రరాజు అరెస్టు అన్యాయం

**కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు**

**కడప**

కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు సోమవారం అధాని అక్రమ వ్యాపారాలపై నిరసిస్తూ రాజ్ భవన్ కు వెళ్లి గవర్నర్ కు వినతిపత్రం ఇవ్వాలని బయలుదేరిన సమయంలో పోలీసులు వారిని విజయవాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్దనే, వెళ్లనీయ కుండా అరెస్టు చేయడం అన్యాయమని కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు అన్నారు.కేంద్ర ప్రభుత్వం ఆదాని గ్రూపులలో పెట్టుబడులను ప్రోత్సహించడాన్ని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తున్నదని, హిండెన్ బర్గ్ రిపోర్ట్ ప్రకారం ఆదాని గ్రూపు కంపెనీలు డొల్ల కంపెనీలని, విషదమవుతున్నదని, అలాంటప్పుడు ఆదానీ గ్రూప్ కంపెనీలలో కేంద్రం ఏ విధంగా పెట్టుబడును ప్రోత్సహిస్తుందో తెలపాలన్నారు. దీనిపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని గవర్నర్ గారిని కోరడానికి బయలుదేరిన కాంగ్రెస్ నేతలను అరెస్టు చేయడం సరైన చర్య కాదన్నారు.పోలీసు బలం ఉపయోగించే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారన్నారు .ఇప్పటికైనా కేంద్రం అదానీ గ్రూపులలో పెట్టుబడులు విరమించుకొని, అదాని ఆర్థిక లావాదేవీల పై విచారణ చేపట్ట డానికి జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలన్నారు. లేదా కాంగ్రెస్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఉద్యమాలకు పిలుపు నిస్తామన్నారు

# ఎమ్మెల్సీ ఎన్నికల కు విజయసాయిరెడ్డి దూరం

**న్యూఢిల్లీ:**



ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి కి వెన్నుదన్నుగా నిలిచిన ఎంపీ విజయసాయిరెడ్డి నేడు మాత్రం ఆయనకు ఝలక్ ఇచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల కు విజయసాయిరెడ్డి దూరంగా ఉన్నారు. వైజాగ్ లో విజయసాయిరెడ్డి తన ఓటును నమోదు చేసుకున్నారు. అనంతరం ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికలకు వైసీపీ తరుపున పోటీ చేసిన అభ్యర్థులకు మద్దతుగా నిలవాల్సిన విజయసాయిరెడ్డి.. ఢిల్లీకి వెళ్లిపోయారు. వైవీ సుబ్బారెడ్డిని ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జిగా నియమించిన తరువాత విజయసాయిరెడ్డి అలకబూనినట్టు తెలుస్తోంది.ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రచారానికీ విజయసాయిరెడ్డి దూరంగా ఉన్నారు. అసలు జగన్‌కు విజయసాయిరెడ్డికి ఇటీవలి కాలంలో సరిగా పడటం లేదన్న టాక్ అయితే జిల్లాలో నడుస్తోంది. సినీ నటుడు తారకరత్న అంత్యక్రియల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు తో విజయసాయిరెడ్డి చనువుగా ఉండటంపై జగన్ ఆగ్రహంతో ఉన్నట్టు సమాచారం. పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి చంద్రబాబు, లోకేశ్ లకు వ్యతిరేకంగా మాట్లాడాలని విజయసాయిరెడ్డిని జగన్ ఆదేశించినట్లు తెలుస్తోంది. కానీ జగన్ ఆదేశాలను పక్కన పెట్టి విజయసాయిరెడ్డి ఢిల్లీ కి వెళ్లినట్టు సమాచారం. ఈ క్రమంలోనే జగన్ మరింత ఆగ్రహంతో ఉన్నట్టు తెలుస్తోంది.

# ఏఎంఆర్ ప్లానెట్ ఆద్వర్యం మహిళలు బైక్ ర్యాలి

**హైదరాబాద్ :**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సికింద్రాబాద్‌లోని ఏఎంఆర్ ప్లానెట్ అద్వర్యం లో 30 మంది మహిళా బైకర్లు ర్యాలీని నిర్వహించారు.ఈ ర్యాలి ఐడియల్ మల్టిప్లెక్స్ డైరెక్టర్ రాకేష్ కుమార్ ఫ్లాగ్ ఆఫ్ చేసి ప్రారంబించారు. బైకర్లు తీసుకున్న 50 కి.మీ మార్గం ఏఎంఆర్ ప్లానెట్ వద్ద బయలుదేరింది మరియు ఇసిఐఎల్, సైనిక్‌పురి, తిరుమలగిరి, అల్వాల్, బొల్లారం, షామీర్‌పేట మీదుగా కొండ పోచమ్మ రిజర్వాయర్‌కు ఆనుకుని ఉన్న శ్రావ్య టెక్స్‌టైల్ తయారీ కేంద్రానికి వెళ్లింది.ఈ సందర్బంగా ఐడియల్ మల్టిప్లెక్స్ డైరెక్టర్ రాకేష్ కుమార్ మాట్లాడుతూ.. ఈరోజు మహిళలు ముందుండి బైకింగ్ మరియు ర్యాలీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మహిళలు కుడా పురుషులకు తెసిపోరనడానికి నిదర్శనమని,మహిళల ర్యాలీ మా కృతజ్ఞతలు అని అన్నారు. భవిష్యత్తులో."ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఆశించారు.60 మందికి పైగా బైకర్లు పూర్తి భద్రతతో ఈ కార్యక్రమానికి హాజరయ్యారు మరియు ఏఎంఆర్ ప్లానెట్ డైరెక్టర్లు రాకేష్ రెడ్డి మరియు అనంత్ గౌడ్ లు ఫ్లాగ్ ఆఫ్ చేసారు.

# జనసేన తీర్థం పుచ్చుకున్న ఈదర హరిబాబు, టీవీ రామారావు

**అమరావతి:**




;ఒంగోలు మాజీ ఎమ్మెల్యే ఈదర హరిబాబు కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు ఇద్దరూ పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన తీర్థం పుచ్చుకున్నారు. వీరితో పలువురు ద్వితియ శ్రేణి నాయకులు కూడా జనసేన కండువా కప్పుకున్నారు. ఈదర హరిబాబు సీనియర్ నేత. తెలుగుదేశం స్థాపించిన తర్వాత పార్టీలో చేరి సుదీర్ఘకాలం పార్టీ కోసం అహర్నిశలు కృషిచేశారు. 1994లో ఒంగోలు నుంచి టీడీపీ తరఫున పోటీచేసిన ఆయన 19వేల 879 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఆ తర్వాత 2014లో ప్రకాశం జిల్లా జడ్పీ చైర్మన్‌గా పనిచేశారు. ఆ తర్వాత రాజకీయాలకు దూరమైన ఈదర.. ఇప్పుడు మళ్లీ అభిమానులు, కార్యకర్తలు, అనుచరుల కోసం క్రియాశీలక రాజకీయాల్లోకి రావాలని భావించి.. జనసేన తీర్థం పుచ్చుకున్నారు. హరిబాబు చేరికతో నియోజకవర్గంలో జనసేనకు మంచిరోజులు వచ్చినట్లేనని.. పార్టీ మరింత బలోపేతం అవుతుందని కార్యకర్తలు చెప్పుకుంటున్నారు. రానున్న ఎన్నికల్లో ఈయన ఎమ్మెల్యే టికెట్‌ఇస్తానని పవన్ హామీ కూడా ఇచ్చారని విశ్వసనీయ వర్గాల సమాచారం.

**జగన్ పట్టించుకోకపోవడంతో..!**

ఇక టీవీ రామారావు విషయానికొస్తే..తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గంలో ఓ వెలుగు వెలిగారీయన. 2009 ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీచేసిన రామారావు గెలుపొందారు. 2014 ఎన్నికల్లో టీడీపీ టికెట్ ఆశించారు కానీ అధిష్టానం కనికరించలేదు. మళ్లీ 2019 ఎన్నికల్లో అయినా సీటు దక్కుతుందేమో అని ఆశపడ్డారు కానీ.. అవన్నీ అడియాసలే అయ్యాయి. టీడీపీ అధిష్టానంపై ఆగ్రహంతో ఇక సైకిల్‌కు టాటా చెప్పేసి వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. 2019 ఎన్నికల్లో తానేటి వనితను (ప్రస్తుతం జగన్ కేబినెట్‌లో హోం మంత్రి) గెలిపించుకుని వస్తే ఆశించిన పదవి ఇస్తానని మాటిచ్చిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. అధికారంలోకి వచ్చిన తర్వాత అస్సలు పట్టించుకోలేదట. అధికార పార్టీలో కొందరికే పదవులు కట్టబెడుతున్నారని.. తీవ్ర అసంతృప్తికి లోనైన టీవీ రామారావు ఇటీవలే వైసీపీకి గుడ్ బై చెప్పేశారు. అభిమానులు, కార్యకర్తలతో సమావేశమైన ఆయన.. జనసేనలో చేరాలని నిర్ణయించుకున్నారు. ఆదివారం నాడు పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన తీర్థం పుచ్చుకున్నారు. అయితే టీడీపీ, వైసీపీలో జరిగిన అన్యాయం గురించి పవన్‌కు చెప్పడంతో రానున్న ఎన్నికల్లో కచ్చితంగా ఎమ్మెల్యే టికెట్ ఇస్తానని హామీ ఇచ్చారని.. ఆ తర్వాతే రామారావు జనసేన తీర్థం పుచ్చుకున్నారని టాక్ నడుస్తోంది. ఈయన రాకతో కొవ్వూరులో జనసేన బలోపేతం అవుతుందని అధిష్టానం భావిస్తోంది.
మొత్తానికి చూస్తే.. జనసేనలో కూడా చేరికలు ఊపందుకుంటున్నాయి. ఈ చేరికలతో అటు వైసీపీ పెద్దలు.. ఇటు టీడీపీ పెద్దలు ఇలా జరిగిందేంటి..? అని ఆలోచనలో పడ్డారట. రానున్న రోజుల్లో టీడీపీ, వైసీపీ నుంచి టికెట్లు రావనుకునే సిట్టింగ్‌లు, మాజీలు కూడా తమ పార్టీలో చేరతారని అధిష్టానం ధీమాతో ఉందని తెలుస్తోంది.నాయకులు రావడం ఓకే.. కండువాలు కప్పడమూ ఓకే మరి వారికి ఏ మాత్రం ప్రాధాన్యత ఉంటుంది..? టికెట్లు ఇచ్చే పరిస్థితి ఉంటుందనే అసలు పాయింట్. రానున్న ఎన్నికల్లో పార్టీలో చేరిన వారికి జనసేన ఏ మాత్రం టికెట్ ఇస్తుందో వేచి చూడాల్సిందే మరి.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఊరట

**హైదరాబాద్:**

తెలంగాణలో బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేల కొనుగోలు కేసు విచారణ సుప్రీంకోర్టులో వాయిదా పడింది. జూలై 31కి వాయిదా వేస్తున్నట్లు సుప్రీంకోర్టు ధర్మాసనం వెల్లడించింది. ఎమ్మెల్యేల కొనుగోలు కేసుని జులై 31కి వాయిదా వేసింది సుప్రీం కోర్టు. ఈ కేసుని సీబీఐకి అప్పగిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంను ఆశ్రయించిన తెలంగాణ ప్రభుత్వం. దీంతో జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎం.ఎం. సుందరేష్ ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చింది పిటిషన్. ఈ కేసులో అఃఎ ఇప్పటి వరకు కేసు నమోదు చేయలేదు. అయితే కేసు వివరాలు అందించాలంటూ.. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఎన్ని సార్లు లేఖరాసిన స్పందించలేదని.. ఃఏఖ తరపు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అటు అఃఎ విచారణ జరపకుండా స్టే ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వ న్యాయవాది దుష్యంత్ దవే కోరారు. అయితే ఇందుకు సంబంధించిన కేసులో స్టే ఇవ్వడానికి నిరాకరించిన సుప్రీం కోర్టు తదుపరి విచారణను జులై 31కి వాయిదా వేసింది.ఎమ్మెల్యేల కొనుగోలు కేసును సీబీఐకి అప్పగించాలంటూ తెలంగాణ హైకోర్టు ఆదేశాలను జారీ చేసింది. నిందితుల పిటీషన్లను అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం వేసిన స్పెషల్ ఇన్విస్టిగేషన్ టీం విచారణలో తమకు న్యాయం జరగదని, సీబీఐకి అప్పగించాలని వారు హైకోర్టులో పిటీషన్ వేశారు. దీంతో హైకోర్టు ఎమ్మెల్యేల కొనుగోలు కేసును సీబీఐ విచారణ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ కేసును విచారించిన సుప్రీంకోర్టు ధర్మాసనం జులై 31వ తేదీకి విచారణను వాయిదా వేసింది. అప్పటి వరకూ కేసు విచారణను సీబీఐకి అప్పగించాల్సిన అవసరం లేదని ధర్మాసనం పేర్కొందిఈ కేసు న్యాయస్థానం పరిధిలో ఉన్నందున దర్యాప్తు కొనసాగించవద్దనే నిబంధన ఉందని న్యాయమూర్తి చెప్పారు. అప్పటిదాకా సీబీఐ దర్యాప్తు అధికారులకు సంబంధిత రికార్డులు, పత్రాలు అందించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు న్యాయమూర్తి వ్యాఖ్యానిం చారు. దర్యాప్తుపై స్టేటస్ కో కొనసాగించాలని ఈ మేరకు సంజీవ్ ఖన్నా ధర్మా సనం సోమవారం ఆదేశాలు ఇచ్చింది. ఇప్పటికే సీబీఐ విచారణపై రాష్ట్ర ప్రభుత్వం చాలా సార్లు కోర్టును స్టే అడిగింది. సుప్రీంకోర్టు ఆ నిర్ణయాన్ని తిరస్కరించింది. తాజాగా కోర్టు ఇచ్చిన స్టేటస్ కోతో సీబీఐ విచారణ ప్రస్తుతానికి వాయిదా పడినట్టే తెలుస్తోంది. అంతకుముందు హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.తెలంగాణలో సంచలనం సృష్టించిన ఎమ్మెల్యే కొనుగోలు కేసును సీబీఐకి అప్పగించాలని హైకోర్టు చెప్పడంతో తెలంగాణ ప్రభుత్వం దాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. గతేడాది డిసెంబర్ 26న ఎమ్మెల్యేల కొనుగోలు కేసును సీబీఐకి అప్పగిస్తూ తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జీ బెంచ్ తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును ఫిబ్రవరి5న హైకోర్టు డివిజన్ బెంచ్ సమర్థించింది. దీంతో, హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఫిబ్రవరి 7వ తేదీన సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసుకు సంబంధించి బీజేపీ, బీఆర్ఎస్ మధ్య పోరు నడుస్తోంది. తమ ఎమ్మెల్యేల్ని కొనుగోలు చేయడానికి బీజేపీ నేతలు ప్రయత్నించారని తెలంగాణ ప్రభుత్వం ఆరోపిస్తుండగా, దీనిపై తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని, అంతా నాటకమని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్ ఖండించారు. ఈ విషయం వెలుగులోకి వచ్చిన సమయంలో ఈ రెండు పార్టీల మధ్య హోరాహోరీ వాతావరణం నెలకొని ఉంది. తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించడం తాజాగా విచారణను జులై 31కి వాయిదా వేయడంతో ప్రభుత్వానికి ఊరట లభించినట్లు అయింది.

# విశాఖే రాజధాని....

**విశాఖపట్టణం:**



విశాఖే రాజధానిగా పరిపాలన కొనసాగుతుందని వైసీపీ ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కూడా విశాఖకు షిఫ్ట్ అవుతున్నారు. ఈ మేరకు ఆయన గ్లోబల్ సమ్మిట్ వేదికగా ప్రకటించారు. రాజధానిగా విశాఖపట్నం ఖాయమని, పాలన సాగించడానికి అవసరమైన అన్ని వసతులు అక్కడ ఉన్నాయని వైఎస్సార్?సీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. ఉగాది నుంచి విశాఖ కేంద్రంగా పాలన సాగుతుందన్న ప్రచారం కూడా జరుగుతోంది. ఈ క్రమంలో సీదిరి అప్పలరాజు అప్పల రాజు కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. విశాఖపట్నం రాజధానిగా త్వరలోనే ఏర్పడుతుంది అని ఆయన అన్నారు. విశాఖ రాజధాని చేయాలని గొప్ప పాలసీ సిఎం జగన్ తీసుకువచ్చారని తెలిపారు.స్దానిక సంస్దలు , పట్టబద్రుల ఎమ్మెల్సీ ఓటు హాక్కును వినియోగించుకున్న మంత్రి సీదిరి అప్పలరాజు.. విపక్ష పార్టీపై ఫైర్ అయ్యారు. ప్రతిపక్షం దొంగ దిబ్బతీయాలనే కులాల పేరుతో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్దిగా ఇండిపెండెంట్ ను బరిలో ఉంచారని అన్నారు. కులాలు ఎగదోసి, పార్టీల వెనుకుండి , అసమానతలు రెచ్చకొట్టడం చంద్రబాబుకు వెన్నతోపెట్టిన విద్య అని ఆరోపించారు. ఈ ఎన్నిలతో అయినా బుద్ది తెచ్చుకోవాలన్నారు. గ్రాడ్యుయేట్స్ వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్ది సీతంరాజు సుధాకర్ కు మద్దతుగా ఉండాలని కోరారు. తమ కులం వారే బాగుపడాలని లక్ష్యంతో అమరావతి రాజధాని కావాలంటూ టీడీపీ కోర్టుకు వెళ్లిందని మండిపడ్డారు. చంద్రబాబు వైఖరిని గ్రాడ్యుయేట్స్ గ్రహించాలన్నారు. గెలవటానికి టిడిపి పోటీచేయటం లేదని, వైసీపీ అభ్యర్థిని ఓడించాలని కుమ్మక్కు రాజకీయాలకు తెరతీసారని ధ్వజమెత్తారు.రెండవ ప్రాధాన్యత విశయంలో ఇతరపార్టీలతో టిడిపి కమ్మక్కుఅయిందని మంత్రి అప్పలరాజు ఆరోపించారు. చంద్రబాబు ఎన్నికలు వస్తే నక్కజిత్తులు చేస్తారని ఘాటుగా వ్యాఖ్యానించారు. జిల్లాలో పొలింగ్ ఉత్సాహంగా కొనసాగుతుందన్న మంత్రి.. వైసిపి శ్రేణులు ఒటర్లను ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు గ్రామాల నుంచి తరలిస్తున్నారని తెలిపారు.ఏపీలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. ప్రకాశం జిల్లా పొదిలి పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత చోటుచేసుంది. మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డిని టీడీపీ నేతలు అడ్డుకున్నారు. అనుచరులతో కలిసి పోలింగ్ కేంద్రంలోకి వెళ్తుండగా అడ్డగించారు. ఒంగోలు సెయింట్ థెరీసా కేంద్రం వద్ద వైసీపీ, టీడీపీ కార్యకర్తల వివాదం నెలకొంది. ఎమ్మెల్యే బాలినేని, మాజీ ఎమ్మెల్యే దామచర్ల రాకతో ఉద్రిక్తత చోటు చేసుకుంది.ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ సీనియర్ నేతలతో చంద్రబాబు భేటీ అయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళిపై చర్చించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బాలినేని వైఖరిపై ప్రకాశం ఎస్పీకి చంద్రబాబు ఫోన్ చేశారు. వైసీపీ నేతలపై పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. బాలినేనిపై చర్యలు తీసుకోవాలని చంద్రబాబు డిమాండ్ చేశారు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

# మాస్ మహారాజా రవితేజ,'రావణాసుర' థర్డ్ సింగిల్‌మార్చి 15న విడుదల






బ్యాక్ టు బ్యాక్ బ్లాక్ బస్టర్స్ తో దూసుకుపోతున్న మాస్ మహారాజా రవితేజ, సుధీర్ వర్మ దర్శకత్వంలో యాక్షన్ థ్రిల్లర్ 'రావణాసుర' తో వస్తున్నారు. ఇటీవలే విడుదలైన ఈ చిత్ర టీజర్‌కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. రవితేజ మల్టీ షేడ్ క్యారెక్టర్‌లో అందరినీ ఆశ్చర్యపరిచారు. హర్షవర్ధన్ రామేశ్వర్, భీమ్స్ సిసిరోలియో కలిసి సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలోని మొదటి రెండు పాటలు మంచి ఆదరణ పొందాయి. ఈ చిత్రంలోని మూడవ సింగిల్- వెయ్యినొక్క జిల్లాల వరకు లిరికల్ వీడియో మార్చి 15న విడుదల కానుంది. అనౌన్స్ మెంట్ పోస్టర్ ఇది రెట్రో నేపథ్య పాట అని సూచిస్తుంది. రవితేజ, మేఘా ఆకాష్ ఇద్దరూ స్కూటర్‌పై కూర్చొని రెట్రో కాస్ట్యూమ్స్‌లో కలర్ ఫుల్ గా కనిపిస్తున్నారు. ఈ పాట ప్రోమో రేపు సాయంత్రం 4:05 గంటలకు విడుదల కానుంది. విజయ్ కార్తీక్ కన్నన్ సినిమాటోగ్రఫీ అందించిన ఈ చిత్రానికి శ్రీకాంత్ విస్సా యూనిక్ కథను అందించారు. అభిషేక్ పిక్చర్స్, ఆర్ టీ టీమ్‌వర్క్స్‌పై అభిషేక్ నామా, రవితేజ నిర్మిస్తున్న ఈ చిత్రానికి నవీన్ నూలి ఎడిటర్.

ఏప్రిల్ 7న సమ్మర్ స్పెషల్ గా ప్రపంచ వ్యాప్తంగా 'రావణాసుర' గ్రాండ్ రిలీజ్ కానుంది.

తారాగణం: రవితేజ, సుశాంత్, అను ఇమ్మాన్యుయేల్, మేఘా ఆకాష్, ఫరియా అబ్దుల్లా, దక్షా నాగర్కర్, పూజిత పొన్నాడ, రావు రమేష్, మురళీ శర్మ, సంపత్ రాజ్, నితిన్ మెహతా (అఖండ ఫేమ్), సత్య, జయ ప్రకాష్ తదితరులు.







Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950